
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



తిరుపతి
జిల్లా వార్తలు
సోమవారం 30 సెప్టెంబరు 2024



వామ్మో..

14 అడుగుల పాము

తిరుమలలోని శృంగేరి శంకర మఠం వెనుకభాగంలోకి ఆదివారం సుమారు 14 అడుగుల పాము వచ్చింది. భక్తులు, సిబ్బంది గుర్తించి భయంతో దూరంగా వెళ్లిపోయారు. వీరి సమాచారంతో టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్ నాయుడు వచ్చి ఆ పామును పట్టుకుని, దట్టమైన అడవిలో విడిచిపెట్టారు. భారీ పొడవు, లావుగా ఉన్న ఈ పామును పలువురు ఆసక్తిగా చూశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సుప్రీంకోర్టు సీజేకు సాదర వీడ్కోలు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ జిల్లాలో రెండు రోజుల పర్యటన ముగించుకుని ఆదివారం మధ్యాహ్నం తిరుగు ప్రయాణమయ్యారు. ఆదివారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్న వీరు.. మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం చేరుకోగా సాదర వీడ్కోలు లభించింది. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు జస్టిస్ కృష్ణమోహన్, వై.లక్ష్మణరావు, జస్టిస్ రాఘవస్వామి, జస్టిస్ రామకృష్ణ, చిత్తూరు ఉమ్మడి జిల్లా ప్రిన్సిపల్ జడ్జి భీమారావు, చీఫ్ ప్రొటోకాల్ అధికారి గురునాథ్, జేసీ శుభం బన్సల్, ప్రొటోకాల్ మెజిస్ట్రేట్ కోటేశ్వరరావు తదితరులు సుప్రీంకోర్టు సీజేకు సాదరవీడ్కోలు పలికారు.

- రేణిగుంట





శ్రీవారి ఆలయంలో సీజే చంద్రచూడ్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి - విమానాశ్రయంలో తిరుగు పయనమైన సీజే దంపతులు

మాకు లేదు జాతి వైరం

మనుషుల మధ్య అనుబంధాలు, ఆప్యాయతలు కొరవడుతున్నాయి. కానీ, జంతువులు మాత్రం జాతి వైరాన్ని మరచి అన్యోన్యతను చూపెడుతున్నాయి. ఇలా కొన్ని కేవీబీపురంలో రెండు మేకలు, ఓ వానరం అన్యోన్యంగా ఉంటున్నాయి. రెండు మేకలున్న ప్రాంతానికి కొంతకాలం కిందట ఓ వానరం తన బిడ్డతో వచ్చి వాటితో కాసేపు ఆడుకుంది. అప్పట్నుంచి వస్తూనే ఉంది. కొసమెరుపు ఏమంటే.. మేకలకు ఆహారంగా వేపాకు, ఆకులను వానరం తీసుకొస్తోంది. వీటిని మేకలు తినకపోతే తలపై కొడుతూ తినిపిస్తుండటం విశేషం.

- కేవీబీపురం



మేకతో ఆడుతున్న వానరం

ముసిలిపేడులోని స్వర్ణముఖి నదిపై వంతెనకు అటు ఇటు 200 మీటర్ల వరకు ఇసుక తవ్వకాలు జరపకూడదు.

- ఇదీ న్యాయస్థానం ఆదేశాలు.

ఇసుకాసురులు మాత్రం '..అయితే మాకేంటి' అంటూ రెచ్చిపోతున్నారు. వంతెన సమీపంలో యథేచ్ఛగా ఇసుక తవ్వేస్తున్నారు. న్యాయస్థానం ఆదేశాలను అమలు చేయడంలో అధికారులూ చేతులెత్తేశారు.

- శ్రీకాళహస్తి



వంతెన సమీపంలోనే తవ్వకాలు

..అయితే మాకేంటి?

- ఇసుకాసురుల బరితెగింపు
- ముసలిపేడు వంతెన వద్ద యథేచ్ఛగా తవ్వకాలు
- లబోదిబోమంటున్న రైతులు, స్థానికులు
- న్యాయస్థానం ఆదేశాలు పట్టించుకోని అధికారులు

శ్రీకాళహస్తి మండలం తొండమనాడు నుంచి ఏర్పేడు మండలం పాపానాయుడుపేట వైపు వెళ్లే గ్రామాలకు ముసిలిపేడు వద్ద స్వర్ణముఖి నదిపై భారీ వంతెన ఉంది. రెండేళ్ల కిందట ఈ వంతెన పక్కనే కొందరు వైసీపీ నాయకులు నదిలోకి వంతెన పక్కన బాట వేశారు. వంతెన కిందనే దక్షిణం వైపున శ్మశానం కూడా ఉంది. వంతెనకు ఇరువైపులా రెండు వందల మీటర్ల దూరం వరకు ఇసుక తవ్వకాలు చేయడం ప్రమాదమని గతం నుంచీ నిబంధన అమల్లో ఉంది. అయితే రెండేళ్ల క్రితం వైసీపీ నాయకులు ఆ నిబంధనను విస్మరించి వంతెన పక్కనే నదిలోకి బాటలు వేసి.. తవ్వేశారు. దీనిపై 2022 సెప్టెంబరు 25న 'స్వర్ణమ్మ శోకం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై అప్పటి అధికారులు స్పందించి నదిలోకి వెళ్లే బాటకు ట్రెంచ్ కొట్టారు. ఆ తర్వాత కూడా రాత్రివేళల్లో వంతెన వద్ద ఇసుక తవ్వకాలు జరుపుతూనే వచ్చారు. దీనివల్ల భవిష్యత్తులో ముప్పు తప్పదన్న ఆందోళనతో స్థానిక రైతులు అప్పట్లో శ్రీకాళహస్తి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వంతెనకు రెండువైపులా 200 మీటర్ల మేర ఇసుక తవ్వకాలు జరిపేందుకు వీల్లేకుండా అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఆ తర్వాత కొంతకాలం ఇక్కడ తవ్వకాలు ఆగాయి. వంతెన పక్కనే గతంలో వైసీపీ నాయకులు చేసిన బాటను రెండు నెలల కిందట కొందరు గ్రావెల్‌తో పటిష్టమైన రోడ్డుగా మార్చారు. రాత్రిళ్లు వంతెనకిందకు చేరి పెద్దఎత్తున ట్రాక్టర్లకు ఇసుక నింపి రేణిగంట, తిరుపతి, తిరుచానూరు ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఓ వైపు నీటిపారుదలశాఖ నిబంధన, మరో వైపు న్యాయస్థానం ఆదేశాలున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే నదిలో కొంత ఎగువభాగాన గుడిమల్లం వద్ద భారీ వర్షాలకు వంతెన కొట్టుకుపోయింది. ఇప్పటికీ అక్కడ పునాది కూడా పడలేదు. అలాంటప్పుడు తవ్వకాలతో ఈ వంతెనకూ ముప్పు వాటిల్లితే రాకపోకలు పూర్తిగా ఆగిపోతాయన్నది స్థానికుల ఆవేదన. అక్రమంగా ఇసుక తవ్వేస్తే భూగర్భ జలాలు అడుగంటుతాయన్నది రైతుల ఆందోళన.



ఇసుక తరలింపునకు వంతెన పక్కన పటిష్టంగా వేసిన రోడ్డు

పగలు పోగేసి.. రాత్రి పంపేసి

- తమిళనాడుకు అక్రమంగా తరలుతున్న ఇసుక

జ్ఞానమ్మ కండ్రిగ నుంచి బసవయ్యపాళేనికి ఇసుక డంపు మార్చారే కానీ.. అక్రమ రవాణాను మాత్రం ఆపడం లేదు ఇసుకాసురులు. అధికారుల నిఘా.. సెబ్ అధికారులు రెండు లారీలను సీజ్ చేయడంతో ఊరు మారింది తప్ప తమిళనాడుకు ఇసుక ఆగలేదు. పగలంతా నిర్మానుష ప్రాంతంలో ఇసుకను పోగేసి.. అర్ధరాత్రి వేళ లారీలతో తమిళనాడుకు తరలిస్తూనే ఉన్నారు.

- శ్రీకాళహస్తి

గతంలో తొట్టంబేడు మండలం జ్ఞానమ్మకండ్రిగ వద్ద ఇటుకబట్టీలో ఇసుక డంపులున్నాయి. వీటిపై పత్రికల్లో కథనాలూ ప్రచురితమయ్యాయి. ఇక్కడి డంపు నుంచి లారీల్లో కింద వైపున ఇసుకను నింపి.. పైన వరిపొట్టు బస్తాలతో కప్పుకొని తమిళనాడుకు అక్రమ రవాణా చేస్తున్నారు. ఈ విషయం పత్రికల్లో వచ్చినా.. అక్రమార్కులు ఆ మరుసటిరోజు రాత్రి అదే తరహాలోనే ఇసుక తరలిస్తుండగా.. ఎస్ఈబీ అధికారులు పక్కా సమాచారంతో దాడి చేశారు. ఎక్స్‌కవేటరు సహా రెండు లారీలను సీజ్ చేశారు. అయినా, ఇసుక అక్రమ రవాణా ఆపని వారు.. డంపు స్థావరాన్ని బసవయ్యపాళెం గ్రామంలోకి మార్చారు. బసవయ్యపాళెం ఎస్టీకాలనీ సమీపంలోని ఓ రియల్‌ఎస్టేట్ వెంచర్‌లో ఇసుక డంప్ చేసి.. తరలిస్తున్నారు. దీనిపై రెండువారాల కిందట దుమారం రేగింది. ఇసుక తరలించే డంప్ వద్దనే వరిపొట్టు బస్తాలు కూడా చిందరవందరగా ఉన్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఆ తర్వాత అదే బసవయ్యపాళెం గ్రామంలోని ముళ్లపొదలతో ఉండే బీడు భూముల్లోకి ఇసుక డంపును మార్చారు. ఈ డంపు వద్ద పగటి పూట ఇసుకను ట్రాక్టర్లతో పోగేస్తున్నారు. రాత్రయితే లారీల్లో తమిళనాడుకు తరలిస్తున్నారు. శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు సమీపంలోనే ఈ డంపు ఉండటం గమనార్హం.



బసవయ్యపాళెం పొలాల్లో ఇసుక డంప్



స్వర్ణముఖి నదిలో ఇసుక వాహనాలు తిరిగిన గుర్తులు

ఆలయాలు అప్పగించాలి

- ధార్మిక పరిషత్తు ఏర్పాటుచేసి
- కల్తీ నెయ్యిపై సుప్రీంకోర్టు నాయ్యమూర్తితో విచారణ జరపాలి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), సెప్టెంబరు 29: 'దేవదాయ శాఖ అజమాయిషీ వల్ల దేవాలయాలకు రక్షణ లేకుండా పోతోంది. అనేక ఆలయాల ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయి. దాడులకు, అవినీతి, కుట్రలకు ఆలయాలు కేంద్రాలవుతున్నాయి. అందుకని హిందూ సమాజ ప్రతినిధులైన స్వామీజీల నేతృత్వంలో ధార్మిక పరిషత్తు ఏర్పాటుచేసి ఆలయాల నిర్వహణ బాధ్యతను అప్పగించాలి' అంటూ విశ్వ హిందూ పరిషత్, బజరంగదళ్ నాయకులు డిమాండు చేశారు. గత ప్రభుత్వ హయాంలో శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యిని వాడటాన్ని నిరసిస్తూ ఆదివారం తిరుపతిలో ర్యాలీ నిర్వహించారు. రామచంద్ర పుష్కరిణి నుంచి మహతి ఆడిటోరియం, ఎన్టీఆర్ సర్కిల్, గాంధీరోడ్డు మీదుగా నాలుకాళ్ల మండపం వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ దక్షిణాంధ్ర ప్రాంత ఉపాధ్యక్షులు దాసరి మురళమ్మ, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ.. నెయ్యి కల్తీ విషయాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ చేయించాలన్నారు. హిందూ దేవాలయాల్లో అన్యమతస్తులైన ఉద్యోగులను ఉంచరాదన్న చట్టాలను ప్రభుత్వాలు తుంగలో తొక్కుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు, అధికారులు కళ్లుతెరిచి టీటీడీలో ఉన్న అన్యమతస్తులైన ఉద్యోగులను తొలగించి ఆలయ పవిత్రతను కాపాడాలని కోరారు. ఈ ర్యాలీలో వీహెచ్‌పీ తిరుపతి విభాగం కార్యదర్శి డాక్టర్ భరణీకృష్ణ, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు భానుప్రకాష్‌డ్డి, సామంచి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శులు పెనుబాల చంద్రశేఖర్, వరప్రసాద్, సాయిప్రసాద్‌జిల్లా కార్యదర్శి డాక్టర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మడి జిల్లాలో ఎక్సైజ్ సీఐల బదిలీ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 29: ఉమ్మడి జిల్లాలో ఆదివారం ఎక్సైజ్ సీఐల బదిలీలు జరిగాయి. తిరుపతి అర్బన్ సీఐగా ఎం.రామచంద్ర, చిత్తూరు అర్బన్ సీఐగా పి.శ్రీహరి నియమితులయ్యారు. తిరుపతి రూరల్‌కు నరసప్పనాయుడు, చంద్రగిరికి కేవీఎస్ ఫణీంద్ర, పుత్తూరుకు మురళీమోహన్, శ్రీకాళహస్తికి లావణ్య, నాగలాపురానికి దశరథరామిరెడ్డి, తిరుమలకు తిరుమలయ్యను నియమిస్తూ ఎక్సైజ్ డైరెక్టర్ నిషాంత్ కుమార్ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు రూరల్‌కు పురుషోత్తం, నగరికి శ్రీనివాసరెడ్డి, కార్వేటినగరానికి శిరీషాదేవి, పుంగనూరుకు సురేష్‌రెడ్డి, పలమనేరుకు భాగ్యలక్ష్మి, కుప్పానికి నాగరాజు, పులిచెర్లకు మాధవస్వామిని నియమించారు. వీరితో పాటు ఈఎస్ టాస్క్‌ఫోర్సు, ఏసీ ఎన్‌ఫోర్సుమెంటు, ఏపీ బ్రివరేజెస్ కార్పొరేషన్, ఎక్సైజ్ చెక్‌పోస్టులకు, మొబైల్ బార్డర్ పెట్రోలింగ్, ఎస్టీఎఫ్ కార్యాలయానికి సీఐలను నియమించారు. వీరందరూ తక్షణమే విధుల్లో చేరాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ బదిలీల్లో తిరుపతి జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి అండతతో ఎక్సైజ్ అధికారి ఒకరు చక్రం తిప్పినట్లు ప్రచారం జరుగుతోంది.

4న శాప్ చైర్మన్‌గా రవినాయుడు ప్రమాణం

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 29: ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ అధ్యక్షుడిగా ఎ.రవినాయుడు అక్టోబరు 4న విజయవాడలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ మేరకు ఆయన ప్రభుత్వానికి సమాచారం తెలియజేశారు. ముందురోజునే ఆయన విజయవాడ చేరుకుంటారు. శాప్ కార్యాలయంలో ప్రభుత్వ పెద్దలతో పాటు క్రీడాశాఖ ముఖ్య అధికారులు, కుటుంబ సభ్యులు, అనుచరగణం మధ్య చైర్మన్‌గా ప్రమాణం చేస్తారు.

బాలకార్మిక, భిక్షాటనరహితంగా తిరుమల

తిరుమల, సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో బాల కార్మికులు, భిక్షాటన లేకుండా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు సూచించారు. సభ్యులు త్రిపర్ణ ఆదిలక్ష్మి, బత్తుల పద్మావతితో కలిసి ఆదివారం ఆయన తిరుమలలోని దుకాణాలు, హోటళ్లలో బాలకార్మికులను, రోడ్లపై భిక్షాటన చేస్తున్న పిల్లలను గుర్తించారు. వారిలో ఎక్కువగా తమిళనాడు, కర్ణాటక, ఒడిస్సా నుంచి వచ్చినట్లు తెలుసుకున్నారు. కొంతమంది పిల్లలు తల్లిదండ్రులతో కలిసి వ్యాపారం చేస్తున్నట్టు గమనించారు. దుకాణాల యజమానులతో సమావేశమై పిల్లలను పనిలో పెట్టుకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొందరికి కౌన్సిలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లాల బాలల సంరక్షణ విభాగం అధికారి శివకుమార్, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.



వ్యాపారులతో మాట్లాడుతున్న అప్పారావు

రేపు పింఛన్ల పంపిణీ

- 2,66,342 మందికి రూ.112.71 కోట్లు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 29: ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను మంగళవారం ఉదయం 6గంటలకే సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి అందజేయనున్నారు. జిల్లాలోని 691 సచివాలయాల పరిధిలో 2,66,342మంది వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, హిజ్రాలు, కల్లుగీత కార్మికులు తదితర లబ్ధిదారులు ఉన్నారు. వీరికి 5,800 సచివాలయ సిబ్బంది పింఛన్లు అందజేయనున్నారు. అక్టోబరు 2వ తేది గాంధీజయంతి నేపథ్యంలో ఒకటినే అందజేస్తారు. మిగిలిన వారికి 3న అందజేయనున్నారు. పింఛన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.112.71 కోట్లు విడుదల చేసింది. ఈ నగదును అధికారులు సోమవారం డ్రా చేయనున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వృద్ధులు, దివ్యాంగులు తదితరలు ఇబ్బంది పడకుండా ఇళ్ల వద్దే మొదటి రోజే పింఛన్లు అందేలా చర్యలు చేపట్టింది.



శ్రీనివాసమంగాపురానికి ఆర్సీవై పాదయాత్ర చేరిక



చంద్రగిరి, సెప్టెంబరు 29: బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ నేతృత్వంలో చేపట్టిన తిరుమల పరిరక్షణ పాదయాత్ర ఆదివారం చంద్రగిరి మండలం, శ్రీనివాసమంగాపురానికి చేరుకుంది. ఆద్యంతం భక్తజన కోలాహలం, భజనలు, కీర్తనలతో భక్తిశ్రద్ధలతో యాత్ర సాగింది. ఎ.రంగంపేట నుంచి శ్రీనివాసమంగాపురం వరకు భక్తులు దారి పొడవునా హారతులు ఇచ్చారు. ఈసందర్భంగా రామచంద్రయాదవ్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా దెబ్బతిన్న హిందూవుల మనోభావాలకు న్యాయం చేయాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలపై సిట్ ఏర్పాటు చేయడం ఆహ్వానించదగిన పరిణామమన్నారు. సిట్ ఎంత మేరకు పారదర్శకంగా విచారణ చేపడతుందో చూడాలన్నారు. సోమవారం ఉదయం శ్రీనివాసమంగాపురం నుంచి అలిపిరికి చేరుకుని తిరుమలకు వెళతామన్నారు. శ్రీవారిని దర్శించుకున్నాక ఏడు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని టీటీడీ అధికారులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. సుమారు 400 మంది భక్తులు పాల్గొన్నారు. **భాకరాపేట:** భాకరాపేటలో బీసీవై అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్‌కు స్థానిక యువత పూలమాలలు, శాలువలతో సత్కరించి స్వాగతం పలికారు. స్థానిక యువత గురుమోహన్, దాసరి శ్రీనివాసులు, భాను, రాజశేఖర్, జయశంకర్, తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ గేమ్స్‌కే యువత పరిమితం

- ఆత్మీయ సన్మాన సభలో వైసీపీ ప్రభుత్వంపై శాప్ చైర్మన్ విమర్శ
- క్రీడారంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తామని ప్రకటన



కొటాల గ్రామంలో శాప్ చైర్మన్ రవినాయుడుకి ఘన స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

చంద్రగిరి, సెప్టెంబరు 29: గత వైసీపీ ప్రభుత్వంలో యువతను మొబైల్ ఫోన్లకే పరిమితం చేశారని శాప్ చైర్మన్ రవినాయుడు విమర్శించారు. ఆయన స్వగ్రామమైన చంద్రగిరి మండలం కొటాలలో ఆదివారం గ్రామస్తులు ఆత్మీయ సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. రాష్ట్ర భవిష్యత్తు, యువత బాగుండాలంటే చంద్రబాబు సీఎం కావాలనే రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఆకాంక్షించి భారీ సీట్లు ఇచ్చారని రవినాయుడు తెలిపారు. క్రీడా రంగాన్ని ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో తనను శాప్ చైర్మన్‌గా ఎంపిక చేశారని తెలిపారు. క్రీడాకారులు ఒక్క మెడల్ కూడా సాధించలేని ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అంతేకాకుండా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చే కోచ్‌లకు వేతనాలు ఇవ్వలేని దుస్థితి వైసీపీ ప్రభుత్వంలో నెలకొందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది క్రీడాకారులను నిర్వీర్యం చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో క్రీడాకారులలో ప్రతిభను గుర్తించి, వారిని ప్రోత్సహించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా చర్యలు చేపడతామన్నారు. ఆడుదాం ఆంధ్రా పేరుతో క్రీడాకారులకు నాసిరకమైన కిట్లు, టీ షర్టులు ఇచ్చారని ఆరోపించారు. చంద్రగిరిలో ఇండోర్ స్టేడియం అసంపూర్తిగా ఉన్నా వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అవసరమైన చోట స్పోర్ట్స్ అకాడమీలు ఏర్పాటు చేస్తామని, చంద్రగిరిలో ఇండోర్ స్టేడియం పూర్తిచేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అనంతరం గ్రామస్తులు శాప్ చైర్మన్ రవినాయుడు దంపతులను ఘనంగా సన్మానించారు.

మాధవికి గౌరవ డాక్టరేట్ ప్రదానం



రామచంద్రాపురం, సెప్టెంబరు 29: రామచంద్రాపురం శ్రీగీతాంజని గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అధినేత ఎన్.మాధవికి గౌరవ డాక్టరేట్ లభించింది. విద్యారంగంలో, సామాజిక సేవలో ఉత్తమ సేవలు అందించినందుకు చెన్నైకు చెందిన ఏసియన్ ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్శిటీ ఆమెను గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. ఈసందర్భంగా శ్రీగీతాంజలి గ్రూప్ స్కూల్స్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

నేడు రామచంద్రాపురం పీఏసీఎస్ మహాసభ

రామచంద్రాపురం, సెప్టెంబరు 29: స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం మహాసభను సోమవారం నిర్వహించనున్నట్లు సింగిల్ విండో పర్సనల్ ఇన్‌చార్జి సునీల్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత ఆర్థిక సంవత్సర లావాదేవీల ఆడిట్ రిపోర్టును సభకు చదివి వినిపిస్తామన్నారు. రెండు సంవత్సరాలుగా లావాదేవీలు జరపని, భూమిలేనివారిని, మరణించిన వారిని,వలస వెళ్లిన వారిని సభ్యత్వం నుంచి తొలగిస్తామన్నారు. ఆధార్ ఈకేవైసీ అప్‌డేట్ చేసుకోవాలన్నారు. సంఘం నుంచి అప్పు తీసుకుని దీర్ఘకాలం పాటు తిరిగిచెల్లించనివారిపై న్యాయపరమైన చర్యలు తీసుకోవడంపై చర్చిస్తామన్నారు.

రికార్డులు లేని వాహనాల స్వాధీనం..స్టేషన్‌కు తరలింపు



బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 29: మండల కేంద్రంలోని ఈబీసీ కాలనీలో ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు ఆదివారం ఉద యం వాహన తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేనటువంటి 8 మోటారు బైకులను స్వాధీనం చేసు కుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. సరైన పత్రాలు చూపించి వాహనాలు తీసుకుపోవాలని తెలిపారు. కాగా ఉదయం 5.30 గంటలకే తనిఖీలు చేయడంతో ప్రజలు తొలుత కొంత ఆందోళన చెందారు.

ముమ్మరంగా కార్డెన్ సెర్చ్



వాటర్‌హౌస్‌కాలనీలో తనిఖీలు చేస్తున్న సీఐ గోపి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 29: శ్రీకాళహస్తిలో ఆదివారం వేకువజామున కార్డెన్ సెర్చ్ ముమ్మరంగా నిర్వహించారు. ఆదివారం వేకువజామున శ్రీకాళహస్తిలో పోలీసు అధికారులు కార్డెన్ సెర్చ్‌నిర్వహించారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహ మూర్తి సూచనలతో 1టౌన్ పరిధిలోని వాటర్‌హౌస్ కాలనీలో సీఐ గోపి సిబ్బందితో సోదాలు చేశారు. అలాగే 2వ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎంఎం వాడలో సీఐ వెంకటేశ్వర్ సిబ్బందితో సహా సోదాలు నిర్వహించారు. వాటర్ హౌస్ కాలనీలో 1, ఎంఎం వాడలో మూడు రికార్డులు సక్రమంగా ద్విచక్ర వాహనాలను గుర్తించారు. అనంతరం వాహనాలను ఆయా పోలీస్‌స్టేషన్లకు తరలించి విచారణ చేపట్టారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

తిరుపతిరూరల్, సెప్టెంబరు29: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వచ్చేనెల 3నుంచి జరిగే బ్రహ్మోత్సవాలకు ముస్తాబు చేస్తున్నారు. ప్రధాన ఆలయంతోపాటు గ్రామానికి వెళ్లే ప్రధానరహదారి, మాడవీధుల్లో విద్యుత్ కటౌట్లు ఏర్పాటు చేశారు. స్వామివారు విహరించే వాహనాలను శుభ్రం చేసి ఉత్సవాలకు సిద్ధం చేశారు. ఈ ఏర్పాట్లపై ఆదివారం ఉత్సవకమిటీ సభ్యులతో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సమీక్షించారు.

అదను చూసి దురాక్రమణ..!

- అధికారుల బదిలీల సమయంలో ఆగడాలు

తిరుపతిరూరల్, సెప్టెంబరు29: తిరుపతి రూరల్ మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. గత వైసీపీ పాలనలో ఆక్రమణదారులు చెరువులు, కాలువలు, వాగు, వంక, మఠం, శ్మశానవాటిక భూములను వేటినీ వదలిపెట్టని విషయం తెలిసిందే. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా కొందరు ఆక్రమణలపర్వానికి తెరలేపారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రెవెన్యూలో సాధారణ బదిలీల నేపథ్యంలో కొత్త అధికారులు రాకముందే ఆక్రమణదారులు అదను చూసి ఈ చర్యలకు పాల్పడుతున్నారు. రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వదిలేయడం, పంచాయతీ అధికారులు ఎన్‌వోసీలు ఇవ్వడం, విద్యుత్‌శాఖ అధికారులు అడిగిందే తడువుగా స్థల సందర్శన చేయకుండానే మీటర్లను కేటాయిస్తుడడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో వెలుగుచూసిన కొన్ని ఆక్రమణలివి.

- పేరూరు పంచాయతీలో సర్వేనెంబరు 546లో 184.5 ఎకరాల్లో చెరువు ఉంది. తిరుపతి- చంద్రగిరి రహదారి నుంచి గ్రామానికి వెళ్లేదారిలో ధర్మరాజుల స్వామి గుడి వెనుకవైపు చెరువునుంచి బయటకు వచ్చే వరదనీరు చెక్‌డ్యామ్‌కి ఆనుకుని ఉన్న దాదాపు రూ.2కోట్ల విలువైన స్థలాన్ని ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. ఎక్స్‌కవేటరు సాయంతో చదును చేసి చెట్లనూ తొలగించారు. నిర్మాణ మెటీరియల్ సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. స్థానిక రెవెన్యూ అధికారి సందర్శించగా తమకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు ఉన్నాయని చెబుతున్నారని తెలిసింది.



పేరూరులో చదును చేసిన చెరువుభూమి



చెంచులక్ష్మి యానాదికాలనీలో కాలువపొరంబోకులో నిర్మాణాలు

- అవిలాల లెక్కదాఖల వేదాంతపురం పంచాయతీ చెంచులక్ష్మి యానాదికాలనీలోని సర్వేనెంబరు 370లోని కాలువ పొరంబోకుభూమిలో ఆక్రమణదారులు దాదాపు పదికిపైగా రేకులషెడ్డుల నిర్మాణాలను చేపట్టారు. మిగిలిన ఖాళీస్థలాన్ని కూడా మట్టితోలి చదునుచేసి ఉన్నారు. ఇదేస్థలంలో గతంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను అధికారులు తొలగించిన విషయం తెలిసిందే. అయినా కూడా మళ్లీ కొందరు ఆక్రమణదారులు ఈస్థలంలో ఆక్రమణలకు బరితెగించారు. కాలనీ నుంచి వచ్చే డ్రైనేజీనీరు కాలువ ద్వారా ఓటేరు చెరువుకు చేరుతుంది. కాలువస్థలం ఆక్రమణలోకి వెళ్లడం వల్ల భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది.

- తుమ్మలగుంటలో కేవీఎస్ స్పోర్ట్స్ పార్క్ ఎదురుగా గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తమ ఆధీనంలోని మఠంభూమిలో లేఅవుట్ తరహాలో ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారు.ఈస్థలంలో మట్టితో రోడ్డుని నిర్మించి ప్లాట్లని అమ్ముతున్నారని తెలిసింది.దీనికి సమీపంలో మఠానికి చెందిన స్థలంలోనే పలు నిర్మాణాలను కూడా చేపడుతున్నారు.



తుమ్మలగుంటలోని మఠంభూమిలో మట్టిరోడ్డు నిర్మాణం

- కేసీపేట పంచాయతీపరిధిలోని భాగ్యనగర్‌లో సర్వేనెంబరు 399/6లో 9.25ఎకరాల కాలువ స్థలం ఉంది. దీనిలో గత వైసీపీ పాలనలో కొన్ని అక్రమ నిర్మాణాలు చేపట్టగా..కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా కొత్తగా కొన్ని నిర్మాణాలు చేపట్టారు. ఈస్థలంలో చేపట్టిన నిర్మాణాలకు రోడ్డుకు అటువైపు ఉన్న పట్టాభూమి డాక్యుమెంట్ ఖాతాని చూపి విద్యుత్ మీటరు తీసుకున్నట్లు తెలిసింది. స్థానిక రెవెన్యూ అధికారి స్పందించి శుక్రవారం కొన్ని అక్రమణలను తొలగించారు.

పెరిగిన కొబ్బరి ధరలు

- సంతోషంలో రైతులు



పాలసముద్రంలో నిల్వ ఉన్న టెంకాయల పొట్టు తీస్తున్న కూలీలు

పాలసముద్రం, సెప్టెంబరు 29: కొబ్బరి కాయల ధరలు నెల రోజులుగా పెరుగుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వంద కొబ్బరికాయలు రూ.1500-1600 వరకు రైతుల వద్ద వ్యాపారులు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. రెండేళ్లుగా వంద కొబ్బరి కాయల ధర రూ.800-850 మధ్య స్థిరంగా ఉండేది. నెల రోజులుగా రూ.850 నుంచి రూ.1200 వరకు, ప్రస్తుతం రూ.1600 వరకు ధరలు పలుకుతున్నాయి. కొబ్బరి తోటలకు నల్లి సోకడం.. దిగుబడి తగ్గి పోవడం.. మరోవైపు ప్రస్తుతం పెళ్లిళ్లు, వరుసగా పండుగలు వస్తుండటం వలన ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. ఇక దేవాలయాలు, బహిరంగ మార్కెట్లు, వ్యాపారులు ఒక్కో కొబ్బరి కాయను రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు. పాలసముద్రం మండలంలో కొబ్బరి తోటలు అధికంగా ఉండటంతో తిరుపతి, శ్రీకాళహస్తి, చెన్నై, తిరుత్తణి, వేలూరు వంటి ప్రాంతాల నుంచి రోజూ వ్యాపారులు ఇక్కడికొచ్చి కొబ్బరికాయలను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు.

ప్రమాదవశాత్తు కారు ఢీకొని బాలుడి మృతి



లీలావిన్షిత్ (ఫైల్‌ఫొటో)

గూడూరు, సెప్టెంబరు 29: తోటి పిల్లలతో సరదాగా ఆడుకుంటున్న బాలుడిని ప్రమాదవ శాత్తు కారు ఢీకొనడంతో బాలుడు మృతిచెందిన విషాద సంఘటన ఆదివారం గూడూరు పట్టణంలో చోటు చేసుకుంది. రెండో పట్టణ పోలీసుల వివరాల మేరకు... స్థానిక వీరారెడ్డిపల్లి ప్రాంతంలో నివాసముంటున్న రవి సైదాపురం మండలం పోతేగుంట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం సెలవు కావడంతో కుమారుడు లీలా విన్షిత్(11)తో కలిసి స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానానికి వెళ్లారు. అదే సమయంలో స్థానిక ప్రశాంతినగర్‌కు చెందిన మెకానిక్ వంశీ కారు డ్రైవింగ్ నేర్చుకునేందుకు మైదానానికి వెళ్లాడు. డ్రైవింగ్ నేర్చుకుంటున్న వంశీ కారును అదుపుచేయలేక వేగంగా వెళ్లి సమీపంలోని ట్రీగార్డును గుద్దుకుంటూ తోటి పిల్లలతో కలిసి ఆడుకుంటున్న లీలావిన్షిత్‌ను ఢీకొన్నాడు. తీవ్ర గాయాలపాలైన బాలుడిని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొగిలి ఘాట్‌లో
ప్రమాదాల నివారణే ధ్యేయం

- అందుబాటులోకి ఇంటర్‌సెప్టార్ వాహనం ● 40 కి.మీ. వేగం దాటితే జరిమానా: ఎస్పీ



ఇంటర్‌సెప్టార్ వాహనం వద్ద పోలీసులు

బంగారుపాళ్యం/పలమనేరు, సెప్టెంబరు 29: బంగారుపాళ్యం మండలం మొగిలి ఘాట్‌లో ప్రమాదాలను నివారించడమే ధ్యేయంగా ఇంటర్‌సెప్టార్ వాహనాన్ని అందుబాటులోకి తెచ్చామని ఎస్పీ మణికంఠ తెలిపారు. ఆదివారం చిత్తూరులోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈనెలలోనే ఘాట్‌లో వరుస ప్రమాదాలు జరిగి 11మంది వరకు మృత్యువాత పడటం బాధాకరమన్నారు. ముఖ్యంగా వాహనాలు పరిమితి కంటే వేగంగా వెళ్లడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించినట్లు తెలిపారు. అందువల్ల ఇకపై ఘాట్‌లో 40 కిలోమీటర్ల కంటే వేగంగా వెళ్లే వాహనాలను ఇంటర్‌సెప్టార్ వాహనంలోని స్పీడ్ గన్ ద్వారా గుర్తించి పోలీసులు జరిమానా విధిస్తారన్నారు. అలాగే ఘాట్‌లో పెట్రోలింగ్ బృందాల నియామకం, ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణ సాయం అందించే ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

జరిమానాలు మొదలు

బంగారుపాళ్యం సీఐ శ్రీనివాసులు తమ సిబ్బందితో కలిసి ఆదివారం నుంచే చర్యలకు ఉపక్రమించారు. అపరిమిత వేగంతో వెళ్లే సుమారు 20 వాహనాలను ఇంటర్‌సెప్టార్ వాహనంలోని స్పీడ్ గన్ సాయంతో గుర్తించారు. ఆయా వాహనదారులకు రూ.10వేల వరకు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

ప్రమాదాల విశ్లేషకుడి సందర్శన



వివిధ శాఖల అధికారుల నుంచి సమాచారం తీసుకుంటున్న బాలాజి

ప్రమాదాల విశ్లేషకుడు బాలాజి ఆదివారం మొగిలి ఘాట్‌ను సందర్శించారు. ప్రమాదాలు జరగడానికి కారణాలను వివిధ శాఖల అధికారుల నుంచి సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఘాట్‌లో ప్రమాదాల నియంత్రణకు పది రోజుల్లోపు చర్యలు తీసుకుంటామన్నారు. స్పీడ్ సిగ్నల్ బోర్డులు, రోడ్డుపై రేడియం స్టిక్కర్లు, డివైడర్లపై వాహనాలు ఒకవైపునుంచి మరోవైపు దూసుకు పోకుండా బలమైన ఇనుప కడ్డీలను కనీసం మూడు అడుగుల ఎత్తు మేర ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదాలు జరిగి దెబ్బతిన్న రోడ్డుపక్కన మలుపుల్లోని బారికేడ్లను ఎప్పటికప్పుడు బాగు చేయించాలన్నారు. అత్యంత ప్రమాదకర మలుపుల్లో డెడ్లీ ఆక్సిడెంట్ జోన్ అనే హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయాలని చెప్పారు.ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బంగారుపాళ్యం సీఐ శ్రీనివాసులు, చిత్తూరు ఎంవీఐ రాజేశ్వరరావు, పలమనేరు ఆర్టీసీ డీఎం టీకే స్వామి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు చర్యలేవీ?

- రోడ్లు, కాలువల్లో పేరుకుపోతున్న కవర్లు
- అమలుకు నోచుకోని నిషేధం



రోడ్డు పక్కన కుప్పగా పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 29: వెంకటగిరి పట్టణంలో ప్లాస్టిక్ నిర్మూలన చర్యలు అమలుకు నోచుకోకపోవడంతో ఎక్కడ చూసినా కవర్లు దర్శనమిస్తు న్నాయి. పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందన్న కారణంగా ప్రభుత్వం ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తూ 2006లో ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజలను చైతన్యవంతులను దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు జరగకుండా తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అయితే వెంకటగిరి పట్టణంలో పట్టణంలోని పాలిథిన్ కవర్ల విని యోగం ఎక్కువగా ఉంటోంది. దుకాణదారులతో పాటు ప్రజలు విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తున్నారు. నిషేధాన్ని అమలు చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో పట్టణంలో రోడ్లపై ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లే కనిపిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు అప్పుడప్పుడూ ప్లాస్టిక్ కవర్లు నిషేధించాలని ర్యాలీలతో ఆర్భాటం చేస్తున్నారే తప్ప తగిన చర్యలు తీసుకోవడంలో అలసత్వం వహిస్తున్నారు. దీంతో ఏ దుకాణంలో చూసినా ప్లాస్టిక్ కవర్లు విచ్చల విడిగా అమ్మకాలు సాగిస్తున్నారు. వినియోగించిన కవర్లను ప్రజలు రోడ్లపైన పడేస్తుండడంతో అవి కాలువల్లోకి చేరి పేరుకుపోతున్నాయి. ఫలితంగా కాలువల్లో మురుగు పారక పారిశుధ్య సమస్య ఏర్పడుతోంది.

ఘనంగా వలస దేవర్లు

- వర్షాల కోసం..



సోమల, సెప్టెంబరు 29: వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకుంటూ సోమల మండలంలోని నడింపల్లె పంచాయతీలోని నడింపల్లె, కరకమంద గ్రామాల ప్రజలు ఆదివారం వలస దేవర్లు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆరు గంటలకే గ్రామస్తులు నడివీధి గంగమ్మ ఆలయం వద్దకు తట్టాబుట్టలతో చేరుకుని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం ఇళ్లకు తాళాలు వేసి పశువులు, కుటుంబ సభ్యులతో కలిసి గ్రామం విడిచి, పొలాలకు వలస బాట పట్టారు. పొలాల వద్ద పందిళ్లు వేసుకుని అమ్మవార్లను ప్రతిష్ఠించి పూజలు చేశారు. అక్కడే వంటావార్పు చేసుకుని, ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. తోటి, తలారులు గ్రామాల్లోకి ఇతర వ్యక్తులు ప్రవేశించకుండా కాపు కాశారు. సాయంత్రం పొలిమేర అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుని పూజలు నిర్వహించారు. గ్రామాల్లోకి చేరుకున్న ప్రజలు గృహాలను శుద్ధిచేసి నడివీధి గంగమ్మ ఆలయం వద్దకు పొంగళ్లతో చేరుకుని పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా పడి పంటలు పండాలని అమ్మవారిని ప్రార్థించారు. జంతు బలిదానం చేసి, బలిహరణాన్ని పొలాల్లో చల్లారు.



తట్టాబుట్టలతో కరకమంద నుంచి వలస పోతున్న గ్రామస్తులు



పొలాల వద్ద వంటావార్పు, పిల్లల ఆటలు

15ఏళ్ల క్రితం వలస వెళ్లాం



కరువు పరిస్థితుల నేపథ్యంలో 15 ఏళ్ల క్రితం వలస వెళ్లాం. గ్రామస్తులందరమూ గ్రామం వీడి పొలిమేర్లకు వెళ్లి అమ్మవార్లకు పూజలు చేశాం. అప్పట్లో ఇంటింటా పశువులు, గొర్రెల మందలు ఉండేవి. వాటికి మేత కూడా దొరికే పరిస్థితి లేదు. క్రమేణా పశు సంపద క్షీణించింది. బావుల్లో నీటి జాడే లేకపోవడంతో వలస వెళ్లాం.

- రామకృష్ణ, కరకమంద

తొలిసారి వలస దేవర్లు చూశా



మా అమ్మమ్మ కుటుంబ సభ్యులతో కలసి గ్రామం విడిచి పొలం వద్దకు తట్టాబుట్టలతో వెళ్లాం. గంగమ్మను ప్రతిష్ఠించి పూజలు చేశాం. పొలం వద్ద ఊయల ఊగాం, అక్కడే వంటలు చేసుకుని సంతోషంగా గడిపాం. సాయంత్రం ఇంటికి చేరుకుని నడివీధి గంగమ్మకు పొంగళ్లు సమర్పించాం. తొలిసారి వలస దేవర్లు చూశా.

- డి.భార్గవి, కరకమంద



నడింపల్లెలోకి ఇతరులు వెళ్లకుండా కాపు కాస్తున్న తలారి

క్రీడాశిక్షకుల సమస్యల పరిష్కారానికి కృషి

శాప్ చైర్మన్ రవినాయుడు


శాప్‌చైర్మన్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న శాప్ కోచ్‌లు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 29: క్రీడా శిక్షకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శాప్ ఛైర్మన్ ఎ.రవినాయుడు హామీ ఇచ్చారు. ఆదివారం శాప్ అవుట్ సోర్సింగ్ శిక్షకుల అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. గత ఐదేళ్లుగా ఎదుర్కొన్న తమ సమస్యలను, చాలీచాలని జీతాలు వంటి అంశాలను ఆయనకు దృష్టికి తెచ్చారు. స్పందించిన రవినాయుడు తప్పకుండా సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానన్నారు. ప్రమాణ స్వీకారం తరువాత శాప్ కోచ్‌లతో సమావేశం నిర్వహిస్తానన్నారు. గతప్రభుత్వం చూపిన నిర్లక్ష్యం చూపబోమని మాటిచ్చారు. కార్యక్రమంలో శాప్ అవుట్ సోర్సింగ్ శిక్షకుల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరాజు, ప్రధాన కార్యదర్శి పాణ్యం వేణు, సంయుక్తకార్యదర్శి హిందూజ, సిమ్మింగ్ కోచ్ ఆది(చక్రవర్తి)జూడో కోచ్ గోపి, ఫుట్‌బాల్‌కోచ్ వినోద్, మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీవారికి పరదాల అందజేత

తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 29: తిరుపతికి చెందిన సుబ్రమణ్యం (మణి) తిరుమల శ్రీవారికి పరదాలను అందజేయనున్నారు. . ఆయన గత 27 సంవత్సరాలుగా ఏటా నాలుగు మార్లు శ్రీవారికి అవసరమైన పరదాలను అందజేయడం ఆనవాయితీ. ఈ మేరకు పురటాసి బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కంటే ముందుగా స్వామివారికి పరదాలు సోమవారం అందజేయడం జరుగుతుందని మణి తెలిపారు. తిరుమల ఆలయంలోని బంగారువాకిలి, రాములవారి మేడ, కులశేఖరాళ్వారు పడి, వకుళాదేవి పరదాలను ఆలయ అధికారులకు అంజేస్తామన్నారు.

ఏపీటీఎఫ్ మహా సభల పోస్టర్ల ఆవిష్కరణ



తిరుపతి(విద్య), సెప్టెంబరు 29: విజయనగరంలో అక్టోబరు 6 నుంచి 8వ తేదీ వరకు జరుగనున్న ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. తిరుపతి సంఘం కార్యాయంలో వారు ఆదివారం మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, ఉపాధ్యక్షులు దేవానంద్ మాట్లాడుతూ... ఏపీటీఎఫ్ 1938వ సంవత్సరంలో ఏర్పాటైందని, ఇప్పటికి 80 సంవత్సరాలుగా ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి, విద్యారంగ అభివృద్ధికి పాటుపడుతూ వస్తోందని చెప్పారు. సంఘం ఏర్పడి 80 వసంతాలు పూర్తయిన సందర్భంగా విజయనగరంలో నిర్వహిస్తున్న మహా సభల్లో ప్రతీఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కౌన్సిలర్లు రవీంద్ర, మల్లిఖార్జున, అదనపు కార్యదర్శి కేశవరెడ్డి, కార్యదర్శులు రామానులు, శ్రీధర్, సుదర్శన్, గణేష్, రెడ్డి శేఖర్ ఏడుకొండలు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 29: ప్రముఖ వ్యాపార వేత్త, పద్మవిభూషణ్ గ్రహీత రాజా బిర్లాజీ జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక గాంధీరోడ్డులోని కస్తూర్బా గాంధీ ట్రస్టు ఛైర్మన్ వీసీ రాయల్ ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, అజయ్‌కుమార్, జల్లి మధుసూదన్, సామంచి శ్రీనివాసులు, బండి మదుసూధన్‌రెడ్డి, ఉదయగిరి కృష్ణమూర్తి, ఉమా, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుండె వ్యాధులకు నడక చక్కటి ఔషధం


శిబిరంలో డాక్టర్ వెంకటరమణ

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 29 : గుండె సంబంధిత వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే రోజూ ఉదయం నడకకు మించిన వైద్యం లేదని వెంకటరమణ హార్ట్ అండ్ మెటర్నటీ ఆస్పత్రి అధినేత డాక్టర్ వెంకటరమణ అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఆయన తమ ఆస్పత్రి ఆధ్వర్యంలో స్థానిక గోవిందరాజస్వామి ఆర్ట్ కాళాశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గుండె సంబంధిత వ్యాధులపై స్థానికులకు అవగాహన కల్పించారు. బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేసి మందులను అందజేశారు. సుమారు 150 మందికి పైగా ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని సేవలు పొందారు. అనంతరం గుండె భద్రతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ నిరుపమ తదితరులు పాల్గొన్నారు.

శాప్ చైర్మన్ రవినాయుడుకు అభినందన


రవినాయుడుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వివేక్, హరికృష్ణ యాదవ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 29: శాప్ ఛైర్మెన్ రవినాయుడును ఎస్వీయూ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరి కృష్ణయాదవ్, కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి సన్మానించారు. ఆదివారం అయనను కలిసి శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపిక అందజేసి సత్కరించారు. ఖేలో ఇండియా పథకం ద్వారా ఎస్వీయూలో క్రీడా సముదాయాలను నిర్మించాలని ఈ సందర్భంగా హరికృష్ణ, వివేక్ కోరారు. తిరుపతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రికెట్ స్టేడియం నిర్మించాలని కోరారు. క్రీడాపరంగా తిరుపతిని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని రవినాయుడు వారికి హామీ ఇచ్చారు.

ఒకే దేశం - ఒకే ఎన్నికలపై నేడు సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), 29: ఒకే దేశం - ఒకే ఎన్నికలు అనే అంశంపై ఎస్వీ యూనివర్సిటీలో సోమవారం సదస్సు నిర్వహించనున్నారు. ద ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ తిరుపతి ఛాప్టర్ సదస్సును నిర్వహించనుంది. ఉదయం 10 గంటలకు ప్రకాశం భవనంలోని ఎకనమిక్స్ గ్యాలరీ (రూం నెంబరు-216)లో జరిగే సమావేశంలో రిటైర్డు ఐఏఎస్ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. రిటైర్డు జిల్లా జడ్జి అచ్యుత పార్థసారథి, తదితరులు పాల్గొంటారని ప్రోగ్రాం నిర్వాహకులు ప్రొఫెసర్ కృష్ణమూర్తి, ప్రొఫెసర్ ప్రయాగ తెలిపారు.

డాక్టరేట్ ప్రదానం


శివప్రసాద్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 29: ఎస్వీ యూనివరిటీ జియాలజీ విభాగ పరిశోధకుడు కె. శివప్రసాద్ డాక్టరేట్ పొందారు. ఇంటిగ్రేటెడ్ స్టడీస్ ఆఫ్ హైడ్రోజియోలాజికల్ యాస్పెక్ట్స్ యూజింగ్ రిమోట్ సెన్సింగ్ అండ్ జీఐఎస్ టెక్నిక్స్ ఇన్ పెద్దవాగు రివర్ బేసిన్ - చిత్తూరు డిస్ట్రిక్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు.

ఆర్సీకి ఎమ్మెల్యే పరామర్శ

తిరుపతి, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో వేలూరు సీఎంసీలో చికిత్స పొంది ఆదివారం తిరుపతికి వచ్చిన టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పరామర్శించారు. జీర్ణకోశవ్యాధితో బాధపడుతూ మూడు రోజుల క్రితం వేలూరు సీఎంసీకి వెళ్లి చికిత్స పొందారు. తిరిగి నివాసానికి ఎమ్మెల్యే వెళ్లి ఆర్సీ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. టీడీపీ, జనసేన నేతలు అధ్యక్షుడు నరసింహ యాదవ్, కార్పొరేటర్ అన్నా అనిత, శ్రీధర్ వర్మ, మహేష్ యాదవ్, రాజారెడ్డి, రుద్రకోటి సదాశివం, ఆముదాల తులసీరాం, సుబ్బు యాదవ్, ఎస్వీఎం శ్రీధర్, మస్తాన్ నాయుడు, జగదీష్, గిరి, శేషు తదితరులు కూడా ఆర్సీని పరామర్శించారు.

ఎల్ఐసీ ఏజెంట్స్ కార్యవర్గం



తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 29: లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సిటీబ్రాంచ్ కార్యవర్గం ఆదివారం ఎంపికైంది. అధ్యక్షుడిగా బి.శ్రీనివాసులు, కార్యదర్శిగా కె.వెంకటమునిని, ట్రెజరర్‌గా టి.ఆనందయ్య, నెల్లూరు డివిజన్ వైస్ ప్రెసిడెంట్‌గా జి.వి.రమణయ్య, డివిజన్ ఈసీ మెంబర్‌గా వై.శివారెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ ప్రెసిడెంట్ వి.వి.సుబ్బారావు, డివిజన్ సెక్రటరి సతీష్‌బాబు, చిత్తూరుజిల్లా సెక్రటరీ రుద్రమోహన్, వీరస్వామి, మదుసూధన్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, షణ్ముగరావు, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

పవన్ పర్యటన విజయవంతం చేద్దాం: ఎమ్మెల్యే ఆరణి


జనసేన నాయకులు, కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 29: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తిరుపతి-తిరుమల పర్యటనను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జనసేన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. డిప్యూటీ సీఎం హోదాలో తొలిసారిగా వస్తున్న నేపథ్యంలో ఆదివారం స్థానిక ఓ ప్రైవేట్ హోటల్లో ఉమ్మడి చిత్తూరు జనసేన కమిటీ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీవారి లడ్డూలో నెయ్యి కల్తీ జరిగిందని, గత ప్రభుత్వ పాలనలో శ్రీవారికి జరిగిన అపచారాన్ని మన్నించాలని పవన్ ప్రాయశ్చిత్త దీక్షను చేపట్టారన్నారు. తిరుమలలో ప్రాయశ్చిత్త దీక్షను విరమించేందుకు మంగళవారం సాయంత్రం తిరుపతి వస్తున్నారన్నారు. మంగళ, బుధవారాల్లో తిరుమలలోనే ఉంటారన్నారు. గురువారం సాయంత్రం తిరుపతి వారాహి సభకు హాజరవుతారన్నారు. సభను విజయవంతం చేసేందుకు జనసైనికులు, వీరమహిళలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, రాయలసీమ కో-కన్వీనర్ రాందాస్‌చౌదరి, తిరుపతి పట్టణాధ్యక్షుడు రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కార్యక్రమాలు

పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్తదీక్ష విరమణకు ముందు పలు కార్యక్రమాలు నిర్వహించాలని జనసేనపార్టీ పిలుపునిచ్చింది. సోమవారం అన్ని దేవాలయాల్లో దీపారాధన చేయాలి. 1న ఓం నమో నారాయణాయ అనే మంత్రజపం, 2న నగర సంకీర్తన, 3న ఆలయాల్లో భజన కార్యక్రమాలు చేపట్టాలని కోరింది.

బధిరుల సంక్షేమానికి కృషి

విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ శ్రీనివాస్


బహుమతులు ప్రదానం చేస్తున్న కిరణ్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 29: బధిరుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ శ్రీనివాస్ అన్నారు. తిరుపతిలోని స్థానిక రాస్ భవనంలో ఆదివారం అంతర్జాతీయ బధిరుల సంజ్ఞల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .బధిరుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేకపథకాలను అమలు చేస్తున్నాయన్నారు. పింఛన్ల పంపిణీ, వినికిడి యంత్రాలు, చదువుకునే విద్యార్థులు టచ్ ఫోన్లు, లాప్‌టాప్, హియర్ అండ్ స్పీచ్ థెరపీ, స్వయం ఉపాధి కోసం రుణాలు వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. పలువురు బధిరులు ఇచ్చిన విన్నపంలో తమ పరిధిలో ఉన్న వాటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ పర్యవేక్షకులు వినోద్, జిల్లా బధిరుల సంఘం అధ్యక్షులు మనోజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు కల్యాణ్‌చక్రవర్తి, ప్రధాన కార్యదర్శి రెడ్డప్పరెడ్డి, కోశాధికారి సుబ్బారాయుడు, మాధవ్, రాస్ డైరెక్టర్ యువరాజ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. తిరుపతి అర్బన్: టీటీడీ ఆధ్వర్యంలో పరిపాలన భవనంలో జరిగిన కార్యక్రమానికి దాదాపు వందమంది బదిర ఉద్యోగులు హాజరయ్యారు. వివిధ ఆట పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ముఖ్య అతిథులుగా టీటీడీ వెల్ఫేర్ ఆఫీసర్ ఆనంద్‌రాజు, ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు చీర్లకిరన్ హాజరై ప్రతిభ చాటిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. సునీల్‌కుమార్‌యాదవ్, కార్యదర్శి బాబు, చంద్రశేఖర్, శ్రీకాంత్, హరి హరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రెజ్లింగ్ జిల్లా జట్ల ఎంపిక



వడమాలపేట, సెప్టెంబరు 29: రెజ్లింగ్ తిరుపతి జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ కార్యదర్శి బాబు తెలియజేశారు. ఆదివారం వడమాలపేటలో ఎంపిక పోటీలు నిర్వహించారు. అండర్-17 బాలుర గ్రీకో రోమన్ రెజ్లింగ్ ఎంపిక పోటీలు నిర్వహించి జట్టును ఎంపిక చేశారు. అలాగే అండర్-14 బాలికల జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన జట్టు అక్టోబర్ 3 నుంచి 6వ తేదీ వరకు కృష్ణా జిల్లాలోని నున్న గ్రామంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొననున్నారు. పీడీలు, చంద్రశేఖర్ రాజు, రవి, జయప్రకాష్, గుర్రప్ప, ప్రసన్నలక్ష్మి, పుష్పవాణి, రెజ్లింగ్‌కోచ్, హిందూజ పాల్గొన్నారు.

అండర్-14 బాలికల జట్టు

శ్రీవల్లి, భార్గవి, శైలజ, యశస్వి, వర్షిత, దీపిక(రేణిగుంట) గీతిక గుణశ్రీ(వడమాలపేట), హర్షవర్ధన్, నాగరాజు(పల్లం) పవన్, హసేన్, గిరిబాబు, సైఫుల్లా(యాదమరి), సంతోష్(ఎంజీఎం)

అండర్-17 బాలుర జట్టు

భాను ప్రకాష్, సతీష్, విగ్నేష్, సంతోష్, ఉదయ్ కుమార్, కే.శ్రవణ్‌కుమార్, అనీష్ (వడమాలపేట) సూర్య మోహనాచారి(పల్లం) హర్షద్ (ఎంజీఎం తిరుపతి).

ఉత్తమ ఉపాధ్యాయులు,విద్యార్థులకు అప్స పురస్కారాలు


ఉత్తమ ఉపాధ్యాయులను పురస్కారంతో సన్మానిస్తున్న ఆరణి శ్రీనివాసులు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 29: ఉత్తమ సమాజాన్ని నిర్మించేవారు ఉపాధ్యాయులని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్స) ఉత్తమ ఉపాధ్యాయ, విద్యార్థి పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమన్నారు. నగిరి ఎమ్మెల్యే భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ... ఉపాధ్యాయులు చూపిన మార్గంలో నడుస్తూ... ఉన్నత విలువలు, విద్య, విజ్ఞానంతో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ వి. శేఖర్ మాట్లాడుతూ... ప్రైవేటు పాఠశాలల్లో ఉన్న ప్రతిభావంతులైన ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తూ అప్స పురస్కారాలు అందజేయడం అభినందనీయమన్నారు. పదవ తరగతి ఫలితాల్లో జిల్లా టాప్ 10లో ఒకటిగా నిలిచిందని, 97.07 ఉత్తీర్ణత సాధించిందని వివరిస్తూ జిల్లా ఇంతటి ఘనత సాధించడంలో ప్రైవేటు విద్యాసంస్థల ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందని చెప్పారు. వంద పాఠశాలల నుంచి ఎంపికైన 150 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ముఖ్య అతిథులు ఘనంగా సత్కరించి పురస్కారాలను అందజేశారు. పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన 200 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో అర్బన్ డీవైఈఓ బాలాజీ, పుత్తూరు డివిజన్ డీవైఈఓ ప్రభాకర్‌రాజు, అప్స రాష్ట్ర అధ్యక్షుడు వి. సుబ్రహ్మణ్యంరాజు, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రమేష్ బాబు, కార్యదర్శి లోకేష్, ట్రెజరర్ అనిల్‌కుమార్, రవిచంద్రారెడ్డి, జిల్లా అడిషనల్ కార్యదర్శి గంగయ్య, ఇతర డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయి వ్యాపారాలకు అనుకూలం

●బీఎన్ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేవీటీ రమేష్



బీఎన్ఐ సమావేశం ప్రారంభంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రతినిధులు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 29: తిరుపతిలో అంతర్జాతీయ స్థాయిలో వ్యాపారాలు అభివృద్ధి చెందే అవకాశముందని బీఎన్ఐ(బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేవీటీ రమేష్ అన్నారు. ఇందుకు వ్యాపారవేత్తలందరూ సహకరించాలన్నారు. బీఎన్ఐ ఆధ్వర్యంలో వ్యాపారవేత్తల సమ్మేళనం ఆదివారం మంగళంలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రమేష్ మాట్లాడుతూ ఒక వేదికపై వివిధ రంగాల వ్యాపారవేత్తలు కలవడం గొప్ప అవకాశమన్నారు. బెంగళూరు, చెన్నై, హైదరాబాదు, వైజాగ్‌నగరాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో వ్యాపారవేత్తలు రావడం అభినందనీయమన్నారు. అందుబాటు ధరలతో నాణ్యమైన వస్తువులను వినియోగదారులకు విక్రయించాలన్నారు. లాభాపేక్షతో వ్యాపార రంగంలో ప్రవేశించకూడదన్నారు. వినియోగదారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. దేశం అన్ని రంగాలలో అగ్రగామిగా నిలిచేందుకు వ్యాపారవేత్తలే ప్రధానమన్నారు. కార్యక్రమంలో బీఎస్ఐ ప్రతినిధులు సాయికిరణ్, సంతోష్, వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎల్‌బీ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 29: ఎస్వీయూ పరిధిలో ఎల్ఎల్‌బీ 6, 10 వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. మనబడి, స్కూల్స్9 వెబ్‌సైట్లలో ఫలితాలు చూడవచ్చని సీఈ దామ్లా నాయక్ తెలిపారు.

శ్రీవారి సేవలో బీసీసీఐ సెక్రటరీ జై షా


ఎంజీ గోపాల్ - జై షా

తిరుమల, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్ షా కుమారుడు, బీసీసీఐ సెక్రటరీ జై షా ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రాత్రి నైవేద్య విరామ సమయంలో సుపథం కోటా ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. ఈమేరకు ఆయనకు ఆలయ సిబ్బంది లడ్డూప్రసాదాలు అందజేశారు. టీటీడీ మాజీ ఈవో ఎంజీ గోపాల్ ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. ప్రముఖ జ్యోతిషుడు విజయకుమార్ కూడా దర్శించుకున్నవారిలో ఉన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.28 కోట్లు

తిరుమల, సెప్టెంబరు29(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.28 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు టీటీడీ ఆదివారం వివరాలను ప్రకటించింది. శనివారం 71,133 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 35,502 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

అలరించిన నృత్య ప్రదర్శన



తిరుచానూరు, సెప్టెంబరు 29: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన అలరించింది. తిరుపతికి చెందిన కొండా సాయి కళాబృంద సభ్యులు నృత్య ప్రదర్శన చేశారు. కళాకారులు తేజోమయి, షణ్ముక ప్రియ, మిధున, జయశ్రీ, నితిక్షణ, వర్షిక, త్రిలోచన, జస్మిత, బిందుమాధవి, తదితరులు మహాగణపతియే, మూషిక వాహన, బో శంబో శివశంబో, అదివో అల్లదివో, కొండల్లో నెలకొన్న, శంభో మహదేవ, పలుకే బంగారమాయేనా వంటి భక్తి గీతాలకు నృత్యం చేశారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లి సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

దేవరకొండలో కార్డెన్ సెర్చ్


గ్రామస్థులకు సూచనలు చేస్తున్న సీఐ ఇమ్రాన్ బాషా

భాకరాపేట, సెప్టెంబరు 29: చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండ గొల్లపల్లె గ్రామంలో భాకరాపేట సీఐ ఇమ్రాన్ బాషా ఆధ్వర్యంలో ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటి వద్ద తనిఖీలు నిర్వహించారు. రికార్డులు లేని 9 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, కొత్త వ్యక్తుల కదలికలను గమనించి తమకు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు. గ్రామాల్లో తగాదాలు లేకుండా సామరస్యంగా మెలగాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాఘవేంద్ర, ఎస్‌బీ ఏఎస్ఐ దస్తగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ప్రమాదవశాత్తు కారు ఢీకొని బాలుడి మృతి


లీలావిన్నిత్ (ఫైల్‌ఫొటో)

గూడూరు, సెప్టెంబరు 29: తోటి పిల్లలతో సరదాగా ఆడుకుంటున్న బాలుడిని ప్రమాదవశాత్తు కారు ఢీకొనడంతో బాలుడు మృతిచెందిన విషాద సంఘటన ఆదివారం గూడూరు పట్టణంలో చోటు చేసుకుంది. రెండో పట్టణ పోలీసుల వివరాల మేరకు... స్థానిక వీరారెడ్డిపల్లి ప్రాంతంలో నివాసముంటున్న రవి సైదాపురం మండలం పోతేగుంట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం సెలవు కావడంతో కుమారుడు లీలా విన్నిత్(11)తో కలిసి స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానానికి వెళ్లారు. అదే సమయంలో స్థానిక ప్రశాంతినగర్‌కు చెందిన మెకానిక్ వంశీ కారు డ్రైవింగ్ నేర్చుకునేందుకు మైదానానికి వెళ్లాడు. డ్రైవింగ్ నేర్చుకుంటున్న వంశీ కారును అదుపుచేయలేక వేగంగా వెళ్లి సమీపంలోని ట్రీగార్డును గుద్దుకుంటూ తోటి పిల్లలతో కలిసి ఆడుకుంటున్న లీలావిన్నిత్‌ను ఢీకొన్నాడు. తీవ్ర గాయాలపాలైన బాలుడిని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తూపిలిపాళెం సముద్రతీరంలో స్వచ్ఛత హీ సేవ



స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో అధికారులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 29: నాయుడుపేటలోని టీఎంఆర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు తూపిలిపాళెం సముద్రతీరంలో ఆదివారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. సముద్రతీరంలో వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కళాశాల అధినేత తంబిరెడ్డి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ వినాయక నిమజ్జనం సమయంలో తూపిలిపాళెం సముద్రతీర ప్రాంత మంతా ప్లాస్టిక్ వస్తువులతో నిండిపోయిందన్నారు. దీంతో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించి శుభ్రం చేశామన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవో నరేంద్ర, సిబ్బంది రంజిత్‌రెడ్డి, జితేంద్రరెడ్డి, సురేంద్ర, సుప్రియ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం


సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాలగురవం బాబు

గూడూరు, సెప్టెంబరు 29: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరం కలిసికట్టుగా పనిచేసి కృషి చేద్దామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాలగురవం బాబు అన్నారు. ఆదివారం స్థానిక త్యాగరాజవీధిలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చేలా పనిచేయాలన్నారు. కొత్తవారు పార్టీలో చేరేలా ప్రోత్సహించాలన్నారు. రాహుల్ గాంధీ, వైఎస్ షర్మిల నాయకత్వంతో ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పరిమల వెంకటేశ్వరరావు, ఎల్లయ్య, శ్రీనివాసులు, సతీష్‌బాబు, ఖాదర్‌బాషా, రమా, రాధయ్య, రత్నం తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసు విచారణ

కోట, సెప్టెంబరు 29: కోటకు చెందిన ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు కావడంతో ఆదివారం గూడూరు డీఎస్పీ వీవీ రమణకుమార్ విచారణ చేశారు. ఇటీవల ఓ బాలిక అదృశ్యమైంది. స్థానిక పోలీసులు కనుగొని తల్లిదండ్రులకు అప్పగించారు. బాలిక అదృశ్యం కావడానికి కారణమైన ఓ యువకుడిపై పోక్సో ఎస్‌ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేశారు. ఆదివారం డీఎస్పీ రమణకుమార్ విచారణ చేపట్టారు. ఆయన వెంట వాకాడు సీఐ హుస్సేన్‌బాషా, ఎస్‌ఐ రమణకుమార్ ఉన్నారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

సూళ్లూరుపేట, సెప్టెంబరు 29: సూళ్లూరుపేట మండలం కుదిరి గ్రామ సమీపంలోని పంట పొలాల్లో కోడి పందేల స్థావరంపై ఆదివారం ఎస్‌ఐ బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకొన్నారు. వారి వద్దనుంచి నాలుగు కోళ్లు, మూడు మోటారు సైకిళ్లు, ఏడు సెల్‌ఫోన్లతో పాటు రూ.2,100 నగదు స్వాధీనం చేసుకొన్నారు.

కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 29: పట్టణంలోని కోళ్లఫారానికి చెందిన భార్య, భర్తల కిడ్నాప్ కేసును ఛేదించామని ఎస్‌ఐ సుబ్బారావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ ద్వారా ట్రేస్ చేశామన్నారు. నాయుడుపేటలో కిడ్నాప్ గురైన వారితో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. కిడ్నాప్ గురైన వారిని ఆదివారం ఉదయం బంధువులకు అప్పగించి, నిందితులపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలి

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 29: ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని డాక్టర్ వెంకన్నబాబు అన్నారు. ఆదివారం స్థానిక కాశీపేటలోని ప్రైవేటు హాల్‌లో రోటరీ క్లబ్ ఆధర్యంలో గుండె జబ్బులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒత్తిడిని అధికమించగలిగితే గుండె పదిలంగా ఉంటుందన్నారు. గుండె జబ్బులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రోటరి క్లబ్ సభ్యులు సుధాకర్ నాయుడు, టీకే.ప్రసాద్, సతీష్, విజయకుమార్, కళాచంద్ర, జానకీరాం, మలమ్మ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

గూడూరు, సెప్టెంబరు 29: మండలంలోని చెంబడిపాళెం గ్రామంలో ఆదివారం పల్లెపాటి రమణయ్య, డాక్టర్ అరుణ సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు వెంకటేశ్వర ప్రసన్న, మధుసూదన్, మహేంద్రరెడ్డి, కీర్తి, త్రివిక్రమరావు, సంస్థ ప్రతినిధి నాగభూషణ్‌రెడ్డి, పెంచలయ్య, వెంకటమ్మ, మస్తానమ్మ, భాస్కర్, మురళి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, సెప్టెంబరు 29: స్థానిక బాలాజీ నగర్‌లోని ప్రగతిసేవాసంస్థ కార్యాలయంలో ఆదివారం పొనకా మల్లికార్జున్‌రెడ్డి దాతృత్వంతో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, పెంచలయ్య, నాగరాజు, మునిప్రసాద్, రాధయ్య, కృష్ణ, విజయ్‌కుమార్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు చర్యలేవీ?

రోడ్లు, కాలువల్లో పేరుకుపోతున్న కవర్లు ● అమలుకు నోచుకోని నిషేధం ● అవగాహన కార్యక్రమాలతో సరి


రోడ్డు పక్కన కుప్పగా పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 29: వెంకటగిరి పట్టణంలో ప్లాస్టిక్ నిర్మూలన చర్యలు అమలుకు నోచుకోకపోవడంతో ఎక్కడ చూసినా కవర్లు దర్శనమిస్తున్నాయి. పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందన్న కారణంగా ప్రభుత్వం ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తూ 2006లో ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజలను చైతన్యవంతులను దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు జరగకుండా తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అయితే వెంకటగిరి పట్టణంలో పట్టణంలోని పాలిథిన్ కవర్ల వినియోగం ఎక్కువగా ఉంటోంది. దుకాణదారులతో పాటు ప్రజలు విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తున్నారు. నిషేధాన్ని అమలు చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో పట్టణంలో రోడ్లపై ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లే కనిపిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు అప్పుడప్పుడూ ప్లాస్టిక్ కవర్లు నిషేధించాలని ర్యాలీలతో ఆర్భాటం చేస్తున్నారే తప్ప తగిన చర్యలు తీసుకోవడంలో అలసత్వం వహిస్తున్నారు. దీంతో ఏ దుకాణంలో చూసినా ప్లాస్టిక్ కవర్లు విచ్చలవిడిగా అమ్మకాలు సాగిస్తున్నారు. వినియోగించిన కవర్లను ప్రజలు రోడ్లపైన పడేస్తుండడంతో అవి కాలువల్లోకి చేరి పేరుకుపోతున్నాయి. ఫలితంగా కాలువల్లో మురుగు పారక పారిశుధ్య సమస్య ఏర్పడుతోంది.

రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు షాహీర్ అహ్మద్



గూడూరు, సెప్టెంబరు 29: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడాపోటీల్లో గూడూరు జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి షాహీర్ అహ్మద్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ శివకుమార్ ఆదివారం తెలిపారు. శనివారం నెల్లూరులో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో అండర్-17 విభాగంలో షాహీర్ అహ్మద్ ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. షాహీర్ అహ్మద్‌కు హెచ్‌ఎం భారతి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

రోటరీ క్లబ్ సమావేశం

నాయుడుపేట, సెప్టెంబరు 29: పట్టణంలోని కిన్నెర కన్వెక్షన్ హాల్‌లో ఆదివారం రోటరీ క్లబ్ సభ్యుల సమావేశం జరిగింది. రోటరీ క్లబ్ అధ్యక్షుడు జయరాజ్‌గోపాల్ మాట్లాడుతూ క్లబ్ సభ్యుల సహకారంతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులకు 45 ట్రై సైకిళ్లు, 15 మంది వితంతువులకు ఆర్థిక చేయూత, మహిళల కుట్టుమిషన్లు, ప్రభుత్వ కళాశాలలకు కంప్యూటర్లు, ప్రింటర్లు అందజేయడం జరిగిందన్నారు. అలాగే గాంధీమందిరం సెంటర్ వద్ద బస్‌షెల్టర్ నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ఉపాధ్యక్షుడు దాసరి ప్రభాకర్ నాయుడు, కార్యదర్శి ఎస్.రామమోహన్, చంద్రశేఖర్, ఉదయ ‍శంకర్, కృష్ణారావు, సోమశేఖర్, చంద్రారెడ్డి, బట్టా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

దొరవారిసత్రం, సెప్టెంబరు 29: దొరవారిసత్రం మండల పరిషత్ కార్యాలయం ఎదుట అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన నిబంధనల వల్లే నేడు దళితులు రాజకీయాల్లో రాణిస్తున్నారని తెలిపారు. చాలకాలంగా దొరవారిసత్రంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నా కార్యరూపం దాల్చలేదని, ప్రస్తుతం దళిత అధికారులు, నాయకులు ముందుకు వచ్చి భూమిపూజ చేయించడం సంతోషకమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులునాయుడు, దళిత నాయకులు సుబ్రహ్మణ్యం, కొప్పల వెంకటకృష్ణయ్య, పీఆర్ డీఈ రమణయ్య, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి యాగాని మల్లిఖార్జున్, బందిల రాఘవయ్య, ఉదయ్, అనీల్‌కుమార్, కృష్ణమూర్తి, కృష్ణయ్య, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

రాఘవారిపాళెంలో పోషకాహార మాసోత్సవాలు

చిట్టమూరు, సెప్టెంబర్ 29: మండల పరిధిలోని రాఘవారిపాళెంలో పోషకాహార మాసోత్సవాలు ఆదివారం నిర్వహించారు. కోట ప్రాజెక్టు సీడీపీవో మునికుమారి పాల్గొని పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రక్త హీనతను అరికట్టాలంటే ఆహారంలో ఎక్కువగా ఐరన్, కాల్షియం, మినరల్, విటమిన్ ఉండే ఆహార పదార్థాలను గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

దుకాణాల్లో ఎలక్ట్రానిక్ కాటాలనే వాడాలి


బియ్యం దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారి

సూళ్లూరుపేట, సెప్టెంబరు 29: చికెన్, మటన్, చేపల మార్కెట్, దుకాణాల్లో తప్పనిసరిగా ఎలక్ట్రానిక్ కాటాలనే వాడాలని గూడూరు తూనికల కొలతల అధికారి భరత్‌కుమార్ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన సిబ్బందితో కలిసి చేపల మార్కెట్, పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. పలు దుకాణాల్లో చాలా మంది సాధారణ త్రాసులను వాడుతున్నట్లు గుర్తించి వాటిని సీజ్‌చే శారు. తప్పనిసరిగా అందరూ ఎలక్ట్రానిక్ కాటాలనే వాడాలని, కొనుగోలుదారులను మోసం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పలు దుకాణాల్లో బియ్యం బస్తాలు తూకం తక్కువగా ఉండటాన్ని గుర్తించి జరిమానా విధించడంతో పాటు కేసులు నమోదు చేశారు.

కామిరెడ్డికి పలువురి శుభాకాంక్షలు

పెళ్లకూరు, సెప్టెంబరు 29: ఎన్డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ప్రభావతమ్మ దంపతులు స్వదేశానికి విచ్చేస్తున్న సందర్భంగా ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా శుభాకాంక్షలు తెలియజేశారు. రెండు నెలల పాటు వ్యక్తిగత పనుల నిమిత్తం కామిరెడ్డి దంపతులు అమెరికాలో పర్యటించి సోమవారం స్వదేశానికి వస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కామిరెడ్డి దంపతులకు ఎంపీపీ, జడ్పీటీసీతో పాటు నాయకులు పెళ్లూరు కార్తీక్‌రెడ్డి, పాలూరు వెంకటరమణారెడ్డి, సాగి జితేంద్ర, బండి బాలు, కన్నలి బాలాజీ శుభాకాంక్షలు తెలియజేశారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, సెప్టెంబరు 29: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యం నివేదించి ముత్యాలమ్మను దర్శించుకున్నారు.

కోటమ్మకు...

కోట, సెప్టెంబరు 29: కోట గ్రామదేవత కోటమ్మకు ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి పండితులు అభిషేకాలుచేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

అదను చూసి దురాక్రమణ..!

అధికారుల బదిలీల సమయంలో ఆగడాలు

తిరుపతి రూరల్, సెప్టెంబరు 29: తిరుపతి రూరల్ మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. గత వైసీపీ పాలనలో ఆక్రమణదారులు చెరువులు, కాలువలు, వాగు, వంక, మఠం, శ్మశానవాటిక భూములను వేటినీ వదలిపెట్టని విషయం తెలిసిందే. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా కొందరు ఆక్రమణలపర్వానికి తెరలేపారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రెవెన్యూలో సాధారణ బదిలీల నేపథ్యంలో కొత్త అధికారులు రాకముందే ఆక్రమణదారులు అదను చూసి ఈ చర్యలకు పాల్పడుతున్నారు. రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వదిలేయడం, పంచాయతీ అధికారులు ఎన్‌వోసీలు ఇవ్వడం, విద్యుత్‌శాఖ అధికారులు అడిగిందే తడువుగా స్థల సందర్శన చేయకుండానే మీటర్లను కేటాయిస్తుడడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో వెలుగుచూసిన కొన్ని ఆక్రమణలివి.


పేరూరులో చదును చేసిన చెరువుభూమి


చెంచులక్ష్మి యానాదికాలనీలో కాలువపోరంబోకులో నిర్మాణాలు

● పేరూరు పంచాయతీలో సర్వేనెంబరు 546లో 184.5 ఎకరాల్లో చెరువు ఉంది. తిరుపతి- చంద్రగిరి రహదారి నుంచి గ్రామానికి వెళ్లేదారిలో ధర్మరాజులస్వామి గుడి వెనుకవైపు చెరువునుంచి బయటకు వచ్చే వరదనీరు చెక్‌డ్యామ్‌కి ఆనుకుని ఉన్న దాదాపు రూ.2కోట్ల విలువైన స్థలాన్ని ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. ఎక్స్‌కవేటరు సాయంతో చదును చేసి చెట్లనూ తొలగించారు. నిర్మాణ మెటీరియల్ సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. స్థానిక రెవెన్యూ అధికారి సందర్శించగా తమకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు ఉన్నాయని చెబుతున్నారని తెలిసింది.

● అవిలాల లెక్కదాఖల వేదాంతపురం పంచాయతీ చెంచులక్ష్మి యానాది కాలనీలోని సర్వేనెంబరు 370లోని కాలువ పోరంబోకుభూమిలో ఆక్రమణదారులు దాదాపు పదికిపైగా రేకులషెడ్డుల నిర్మాణాలను చేపట్టారు. మిగిలిన ఖాళీస్థలాన్ని కూడా మట్టితోలి చదునుచేసి ఉన్నారు. ఇదేస్థలంలో గతంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను అధికారులు తొలగించిన విషయం తెలిసిందే. అయినా కూడా మళ్లీ కొందరు ఆక్రమణదారులు ఈస్థలంలో ఆక్రమణలకు బరితెగించారు. కాలనీ నుంచి వచ్చే డ్రైనేజీనీరు కాలువ ద్వారా ఓటేరు చెరువుకు చేరుతుంది. కాలువస్థలం ఆక్రమణలోకి వెళ్లడం వల్ల భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది.


తుమ్మలగుంటలోని మఠంభూమిలో మట్టిరోడ్డు నిర్మాణం

● తుమ్మలగుంటలో కేవీఎస్ స్పోర్ట్స్ పార్క్ ఎదురుగా గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తమ ఆధీనంలోని మఠంభూమిలో లేఅవుట్ తరహాలో ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారు. ఈస్థలంలో మట్టితో రోడ్డుని నిర్మించి ప్లాట్లని అమ్ముతున్నారని తెలిసింది. దీనికి సమీపంలో మఠానికి చెందిన స్థలంలోనే పలు నిర్మాణాలను కూడా చేపడుతున్నారు.

● కేసీపేట పంచాయతీపరిధిలోని భాగ్యనగర్‌లో సర్వేనెంబరు 399/6లో 9.25ఎకరాల కాలువ స్థలం ఉంది. దీనిలో గత వైసీపీ పాలనలో కొన్ని అక్రమ నిర్మాణాలు చేపట్టగా...కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా కొత్తగా కొన్ని నిర్మాణాలు చేపట్టారు. ఈస్థలంలో చేపట్టిన నిర్మాణాలకు రోడ్డుకు అటువైపు ఉన్న పట్టాభూమి డాక్యుమెంట్ ఖాతాని చూపి విద్యుత్ మీటరు తీసుకున్నట్లు తెలిసింది. స్థానిక రెవెన్యూ అధికారి స్పందించి శుక్రవారం కొన్ని అక్రమణలను తొలగించారు.

నేరాలను కట్టడి చేసేందుకే కార్డెన్ సెర్చ్


అరుంధతీయవాడలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

గూడూరు, సెప్టెంబరు 29: నేరాలను కట్టడి చేసేందుకు కార్డెన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని డీఎస్పీ రమణకుమార్ అన్నారు. ఆదివారం స్థానిక అరుంధతీయపాళెంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధృవీకరణ పత్రాలు లేని పది ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా అనుమానిత వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు చేపడుతామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీఐలు శేఖర్‌బాబు, శ్రీనివాస్, కిషోర్‌బాబు, ఎస్‌ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వట్రపాలెంలో కార్డెన్ సెర్చ్


స్థానికులతో మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 29: సూళ్లూరుపేట పట్టణం వట్రపాలెంలో కార్డెన్ సెర్చ్‌లో భాగంగా ఆదివారం నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 12 మోటారు సైకిళ్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట, శ్రీహరికోట ఎస్‌ఐలు బ్రహ్మనాయుడు, శ్రీకాంత్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

రక్తదాన శిబిరం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 29: విశ్వహిందూ పరిషత్ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు సుంకర ప్రతిమ ఆధ్వర్యం లో ఆదివారం మున్సిపల్ కార్యాలయం వద్ద నెల్లూరు రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహిం చారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ కార్యదర్శి ఏజీ కిసోర్, జనసేన నాయకులు పొన్నా కాటయ్య, భైరి పార్థసారధి, మల్లికార్జున, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి పర్యటన

చిట్టమూరు, సెప్టెంబర్ 29: మండలంలోని గునపాడు, యల్లసిరి, అరవపాళెం గ్రామాల దళితవాడల్లో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు ఆదివారం పర్యటించారు. ఎస్సీ వర్గీకరణ వల్ల మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వివరించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కమిటీలు ఏర్పాటు చేసి ఉద్యమం చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు మీజూరు మాదవ్, బందిలి రంగనాథ్, మల్లికార్జున్, వసంత్, గునపాడు, యల్లసిరి, సమితి అధ్యక్షుడు శివప్రసాద్, మహేందర్ పాల్గొన్నారు.

నేడు శ్రీవారికి పరదాలు అందజేత

తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 29: తిరుపతికి చెందిన సుబ్రమణ్యం(మణి) తిరుమల శ్రీవారికి పరదాలను అందజేయనున్నారు. . ఆయన గత 27 సంవత్సరాలుగా ఏటా నాలుగు మార్లు శ్రీవారికి అవసరమైన పరదాలను అందజేయడం ఆనవాయితీ. ఈ మేరకు పురటాసి బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కంటే ముందుగా స్వామివారికి పరదాలు సోమవారం అందజేయడం జరుగుతుందని మణి తెలిపారు. తిరుమల ఆలయంలోని బంగారువాకిలి, రాములవారి మేడ, కులశేఖరాళ్వారుపడి, వకుళాదేవి పరదాలను ఆలయ అధికారులకు అంజేస్తామన్నారు.

ఎల్‌ఎల్‌బీ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 29: ఎస్వీయూ పరిధిలో ఎల్‌ఎల్‌బీ 6, 10వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. మనబడి, స్కూల్స్9 వెబ్‌సైట్లలో ఫలితాలు చూడవచ్చని సీఈ దామ్లానాయక్ తెలిపారు.

ఏపీటీఎఫ్ మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ

తిరుపతి(విద్య), సెప్టెంబరు 29: విజయనగరంలో అక్టోబరు 6 నుంచి 8వ తేదీ వరకు జరుగనున్న ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. తిరుపతి సంఘం కార్యాయంలో వారు ఆదివారం మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, ఉపాధ్యక్షులు దేవానంద్ మాట్లాడుతూ... ఏపీటీఎఫ్ 1938వ సంవత్సరంలో ఏర్పాటైందని, ఇప్పటికి 80 సంవత్సరాలుగా ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి, విద్యారంగ అభివృద్ధికి పాటుపడుతూ వస్తోందని చెప్పారు. సంఘం ఏర్పడి 80 వసంతాలు పూర్తయిన సందర్భంగా విజయనగరంలో నిర్వహిస్తున్న మహా సభల్లో ప్రతీఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కౌన్సిలర్లు రవీంద్ర, మల్లిఖార్జున, అదనపు కార్యదర్శి కేశవరెడ్డి, కార్యదర్శులు రామానులు, శ్రీధర్, సుదర్శన్, గణేష్, రెడ్డి శేఖర్ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ గేమ్స్‌కే యువత పరిమితం

సన్మాన సభలో వైసీపీ ప్రభుత్వంపై శాప్ చైర్మన్ విమర్శ ● క్రీడారంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తామని ప్రకటన


కొటాలలో శాప్ చైర్మన్ రవినాయుడుకి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

చంద్రగిరి, సెప్టెంబరు 29: గత వైసీపీ ప్రభుత్వంలో యువతను మొబైల్ ఫోన్లకే పరిమితం చేశారని శాప్ చైర్మన్ రవినాయుడు విమర్శించారు. ఆయన స్వగ్రామమైన చంద్రగిరి మండలం కొటాలలో ఆదివారం గ్రామస్తులు ఆత్మీయ సన్మానసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. రాష్ట్ర భవిష్యత్తు, యువత బాగుండాలంటే చంద్రబాబు సీఎం కావాలనే రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఆకాంక్షించి భారీ సీట్లు ఇచ్చారని రవినాయుడు తెలిపారు. క్రీడా రంగాన్ని ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో తనను శాప్ చైర్మన్‌గా ఎంపిక చేశారని తెలిపారు. క్రీడాకారులు ఒక్క మెడల్ కూడా సాధించలేని ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అంతేకాకుండా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చే కోచ్‌లకు వేతనాలు ఇవ్వలేని దుస్థితి వైసీపీ ప్రభుత్వంలో నెలకొందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది క్రీడాకారులను నిర్వీర్యం చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో క్రీడాకారులలో ప్రతిభను గుర్తించి, వారిని ప్రోత్సహించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా చర్యలు చేపడతామన్నారు. ఆడుదాం ఆంధ్రా పేరుతో క్రీడాకారులకు నాసిరకమైన కిట్లు, టీ షర్టులు ఇచ్చారని ఆరోపించారు. చంద్రగిరిలో ఇండోర్ స్టేడియం అసంపూర్తిగా ఉన్నా వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అవసరమైన చోట స్పోర్ట్స్ అకాడమీలు ఏర్పాటు చేస్తామని, చంద్రగిరిలో ఇండోర్ స్టేడియం పూర్తిచేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అనంతరం గ్రామస్తులు శాప్ చైర్మన్ రవినాయుడు దంపతులను ఘనంగా సన్మానించారు.

ఒకే దేశం - ఒకే ఎన్నికలపై నేడు సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), 29: ఒకే దేశం - ఒకే ఎన్నికలు అనే అంశంపై ఎస్వీ యూనివర్సిటీలో సోమవారం సదస్సు నిర్వహించనున్నారు. ద ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ తిరుపతి చాప్టర్ సదస్సును నిర్వహించనుంది. ఉదయం 10 గంటలకు ప్రకాశం భవనంలోని ఎకనమిక్స్ గ్యాలరీ (రూం నెంబరు-216)లో జరిగే సమావేశంలో రిటైర్డు ఐఏఎస్ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. రిటైర్డు జిల్లా జడ్జి అచ్యుత పార్థసారథి, తదితరులు పాల్గొంటారని ప్రోగ్రాం నిర్వాహకులు ప్రొఫెసర్ కృష్ణమూర్తి, ప్రొఫెసర్ ప్రయాగ తెలిపారు.

అమ్మని మించిన దైవం లేదు



భారతమ్మ పుస్తకావిష్కరణచేస్తున్న ప్రముఖులు

శ్రీకాళహస్తి,సెప్టెంబరు 29: సృష్టిలో ప్రతి జీవికి అమ్మకు మించిన దైవం లేదని పలువురు ప్రముఖులు అభిప్రాయం వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తిలో ఆదివారం ప్రముఖ రచయిత, సీనియర్ పాత్రికేయుడు మునిసురేష్ పిళ్లై తల్లి భారతమ్మ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా 'మా ముద్దుల భారతమ్మ' పేరుతో పుస్తకాన్ని ఆవిష్కరించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్, ప్రముఖ రచయిత ఆర్ఎం ఉమామహేశ్వరరావు, సాహితీవేత్తలు దేవీప్రసాద్, బాలాజీ, మురళి, సాయిరాం, సీనియర్ పాత్రికేయుడు గోవిందస్వామి పాల్గొన్నారు.

ముగిసిన ఉరుసు వార్షిక గంధోత్సవం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 29: పట్టణంలోని స్వర్ణముఖి నది ఒడ్డున గల హజరత్ క్వాజా సయ్యద్ షా జులేషా పీర్ ఖాదిరివలి అల్లా ఉరుసు గంధోత్సవం ఆదివారం నాటితో ముగిసింది. సాయంత్రం దర్గా వద్ద నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మతపెద్దలు, ఉరుసు కమిటీ సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

రేపు పెన్షనర్లు అందుబాటులో ఉండండి

● మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ వెల్లడి

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 29: సామాజిక పింఛన్లు తీసుకునేందుకు లబ్ధిదారులందరూ ఒకటవ తేదీ మంగళవారం ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు అందుబాటులో ఉండాలని పుత్తూరు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మొత్తం 5,774 మంది పెన్షన్‌దారులు ఉన్నారని వివరించారు. సచివాలయం సిబ్బంది, క్లస్టర్ ఇన్‌ఛార్జులు పెన్షన్ పంపిణీ చేస్తారని తెలియజేశారు.

శాస్త్రోక్తంగా పవిత్రాల సమర్పణ



పవిత్రాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న అర్చకులు, అధికారులు

వడమాలపేట, సెప్టెంబరు 29: అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం శాస్త్రోక్తంగా పవిత్రాల సమర్పణ గావించారు. ఉదయం స్వామవారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి తోమాలసేవ, అర్చన చేపట్టారు. యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామివారి ఉత్సవమూర్తుల స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. అనంతరం మూలవిరాట్‌కు, ఉత్సవర్లకు, పద్మావతి, అండాల్ అమ్మవార్లకు, జయవిజయులకు, గరుడాళ్వార్‌కు, అంజేనేయస్వామివారికి, ధ్వజస్తంభం, ఇతర పరివార దేవతలకు పవిత్రాల సమర్పణ నిర్వహించారు. సాయంత్రం యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, ఆలయ అధికారి శివకుమార్ పాల్గొన్నారు.

నలుగురు వీఆర్వోల బదిలీ

పుత్తూరు అర్బన్, సెప్టెంబరు 29: పుత్తూరు మండల పరిధిలో నలుగురు వీఆర్వోలు బదిలీ అయ్యారు. మునిరత్నం, సురేష్‌బాబు శ్రీకాళహస్తికి బదిలీ అయ్యారు. చంద్రశేఖర్ పుత్తూరులోనే నందిమంగళానికి, అరుణ కల్యాణపురం వీఆర్వోగా వెళ్లారు. తిరుపతి అర్బన్ నుంచి ప్రేమలత మండలంలోని ఉత్తరపు కండ్రిగకు, పాకాల మండలం నుంచి ప్రియాంక పుత్తూరు దాసరి గుంటకు రానున్నారు. పుత్తూరు మండలంలో 18 మంది వీఆర్వోలు విధులు నిర్వహిస్తుండగా ఇద్దరు మాత్రమే శ్రీకాళహస్తి మండలానికి బదిలీ అయ్యారు.

రెజ్లింగ్ జిల్లా జట్ల ఎంపిక



వడమాలపేట, సెప్టెంబరు 29: రెజ్లింగ్ తిరుపతి జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ కార్యదర్శి బాబు తెలియజేశారు. ఆదివారం వడమాలపేటలో ఎంపిక పోటీలు నిర్వహించారు. అండర్-17 బాలుర గ్రీకో రోమన్ రెజ్లింగ్ ఎంపిక పోటీలు నిర్వహించి జట్టును ఎంపిక చేశారు. అలాగే అండర్-14 బాలికల జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన జట్టు అక్టోబర్ 3 నుంచి 6వ తేదీ వరకు కృష్ణా జిల్లాలోని నున్న గ్రామంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నారు. పీడీలు, చంద్రశేఖర్ రాజు, రవి, జయప్రకాష్, గుర్రప్ప, ప్రసన్నలక్ష్మి, పుష్పవాణి, రెజ్లింగ్‌కోచ్, హిందూజ తదితరులు పాల్గొన్నారు.

అండర్-14 బాలికల జట్టు

శ్రీవల్లి, భార్గవి, శైలజ, యశస్వి, వర్షిత, దీపిక(రేణిగుంట) గీతిక గుణశ్రీ(వడమాలపేట), హర్షవర్ధన్, నాగరాజు(పల్లం) పవన్, హసేన్, గిరిబాబు, సైఫుల్లా(యాదమరి), సంతోష్(ఎంజీఎం)

అండర్-17 బాలుర జట్టు

భాను ప్రకాష్, సతీష్, విగ్నేష్, సంతోష్, ఉదయ్ కుమార్, కే.శ్రవణ్‌కుమార్, అనీష్ (వడమాలపేట) సూర్య, మోహనాచారి(పల్లం) హర్షద్ (ఎంజీఎం తిరుపతి)

చిన్నారి మోక్షిత వైద్యానికి రూ.50 వేలు ఆర్థికసాయం చేసిన అమృతరాజ్



పుత్తూరు టౌన్, సెప్టెంబరు 29: లివర్ వ్యాధితో పడుతున్న చిన్నారి వైద్యం కోసం నగరి మున్సిపాలిటీకి చెందిన థాసన్ అమృతరాజ్ (టీఆర్ఎస్) రూ.50వేల ఆర్థికసాయం అందించారు. పుత్తూరు మండల పరిధిలోని నంది మంగళం గ్రామానికి చెందిన మోక్షిత(6) లివర్ వ్యాధితో బాధపడుతోంది. ఈ విషయం తెలుసుకున్న ఆయన ఆదివారం వారింటికి వెళ్లి ఆర్థికసాయం అందించారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ముమ్మరంగా కార్డెన్ సెర్చ్



వాటర్‌హౌస్ కాలనీలో తనిఖీలు చేస్తున్న సీఐ గోపి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 29: శ్రీకాళహస్తిలో ఆదివారం వేకువజామున కార్డెన్ సెర్చ్ ముమ్మరంగా నిర్వహించారు. ఆదివారం వేకువజామున శ్రీకాళహస్తిలో పోలీసు అధికారులు కార్డెన్ సెర్చ్‌నిర్వహించారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహ మూర్తి సూచనలతో 1టౌన్ పరిధిలోని వాటర్‌హౌస్ కాలనీలో సీఐ గోపి సిబ్బందితో సోదాలు చేశారు. అలాగే 2వ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎంఎం వాడలో సీఐ వెంకటేశ్వర్ సిబ్బందితో సహ సోదాలు నిర్వహించారు. వాటర్ హౌస్ కాలనీలో 1, ఎంఎం వాడలో మూడు రికార్డులు సక్రమంగా ద్విచక్ర వాహనాలను గుర్తించారు. అనంతరం వాహనాలను ఆయా పోలీస్‌స్టేషన్లకు తరలించి విచారణ చేపట్టారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

వరదయ్యపాళెం, సెప్టెంబరు 29: రైతులను రుణాలను సద్వినియోగం చేసుకోవాలని పర్సన్ ఇన్‌ఛార్జి అమరవేలు కోరారు. కదూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మహాజన సభ ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో అధికారులు రైతులతో చర్చించారు. రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించి మళ్లీ తీసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో సంపత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 29: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని తిరుపతి ఎంపీ గురుమూర్తిని సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య కోరారు. తిరుపతిలోని ఆయన కార్యాలయంలో ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో దళితులు, గిరిజనుల భూములను అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు అతి తక్కువ ధరకే కొని అన్యాయం చేస్తున్నారన్నారు. దళితులపై అగ్రవర్ణాల దాడులను అరికట్టేందుకు కృషిచేయాలన్నారు. నియోజకవర్గంలోని పంచాయతీలకు ఎంపీ నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు.

ప్రభుత్వాస్పత్రిలో మందుల కొరత



శ్రీకాళహస్తి ఏరియా ప్రభుత్వ ఆస్పత్రి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 29: శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని మందుల కొరత వెంటాడుతోంది. కనీస ప్రాథమిక మందులు కూడా అందుబాటులో లేవని రోగులు వాపోతున్నారు. వంద పడకల ఈ ఆస్పత్రిని 150 పడకల సామర్థ్యానికి పెంచాలని ఏడేళ్లుగా ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నారు. శ్రీకాళహస్తి పట్టణంతో పాటు పొరుగున ఏడు మండలాల నుంచి నిరుపేదలు ఈ ఆస్పత్రిలో వైద్యం కోసం విచ్చేస్తుంటారు. ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని నాలుగేళ్ల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. అయినా గత పాలకులు ప్రభుత్వాస్పత్రిలో వైద్యసేవలపై దృష్టిసారించలేదు. దాంతో రాష్ట్రస్థాయిలో మూడేళ్ల క్రితం వరకు మొదటిస్థానంలో ఉన్న ఏరియా ఆస్పత్రి ప్రస్తుతం కమ్యూనిటీ సెంటర్ స్థాయి ర్యాంకుతో పాటు గణాంకాలు కూడా పడిపోయాయి. దీనికి తోడు సుమారు నెల రోజుల నుంచి ఆస్పత్రిలో మందుల కొరత నెలకొందని రోగులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

లేని మందులు ఏవంటే..?

ఈ ఆస్పత్రిలో జ్వరానికి వినియోగించే డోలో 650ఎం.జి. మాత్రలు, పారాసిటమల్ 100ఎం.ఎల్ ఐవీ ఇంజక్షన్లు, ముపిరోసిన్ ఆయింట్‌మెంట్, గాయాలను శుభ్రం చేసే స్పిరిట్, అత్యవసర, ఆపరేషన్ థియేటర్లలో వినియోగించే ట్రమడాల్ ఇంజక్షన్లు, సెలైన్లు ఎక్కించేందుకు చిన్నపిల్లలకు ఉప యోగించే ఐవీట్యానుల 20, 22నెంబర్ల గేజ్ సూదులు అందుబాటులో లేవని రోగులను తిప్పి పంపేస్తున్నారు. అలాగే మూత్ర సమస్యలు ఉన్న రోగులకు మర్మాంగంలో ఏర్పాటు చేసే ఫొలిస్ క్యాపిటర్, శస్త్రచికిత్సలు చేసిన రోగులకు గాయం త్వరగా మానేందుకు ఇచ్చే నెట్రోజెల్ ఇంజక్షన్లు అందుబాటులో లేవని సమాచారం. కనీసం మందులు కడుపులో మంట, చితినొప్పి, గ్యాస్ట్రిక్ సమస్యలతో వచ్చే వారికి ఇచ్చే పాంటాప్ ఇంజెక్షన్ కూడా లేకపోవడంతో మూడు రోజుల క్రితం అత్యవసర విభాగంలో కొందరు రోగులు సిబ్బందిని నిలదీసిన ఘటన వెలుగు చూసింది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వాస్పత్రిలో మందుల కొరత లేకుండా చూడాల్సి ఉంది.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



మందులను అందజేస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 29: తొట్టంబేడు మండలం తంగేళ్లపాళెం పంచాయతీలో ప్రభుత్వ పాఠశాలలో శ్రీకాళహస్తికి చెందిన భరత్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ జూలుగంటి భరత్, డాక్టర్ దీపిక ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ చెంచుకృష్ణమనాయుడు ప్రారంభించారు. సుమారు 101మందికి ఈసీజీ, షుగర్ పరీక్షలు నిర్వ హించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అదేవిధంగా కీళ్ల నొప్పులు, గ్యాస్ట్రబుల్‌తో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు చదివే విద్యార్థులకు నులిపురుగుల నివారణకు మాత్రలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కిరణ్ నాయుడు, ధనమ్మ, సురేష్, పవన్ పాల్గొన్నారు.

రికార్డులు లేని వాహనాల స్వాధీనం..స్టేషన్‌కు తరలింపు



బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 29: మండల కేంద్రంలోని ఈబీసీ కాలనీలో ఎస్ఐ విశ్వనాథ నాయుడు ఆదివారం ఉదయం వాహన తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేనటువంటి 8 మోటారు బైకులను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. సరైన పత్రాలు చూపించి వాహనాలు తీసుకుపోవాలని తెలిపారు. కాగా ఉదయం 5.30 గంటలకే తనిఖీలు చేయడంతో ప్రజలు తొలుత కొంత ఆందోళన చెందారు.

మన్ కీ బాత్‌లో విలువైన సలహాలు



మన్‌కీ బాత్ వీక్షిస్తున్న కోలా ఆనంద్ తదితరులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 29: దేశ ప్రజలకు ప్రధానమంత్రి మన్ కీ బాత్ ద్వారా చాలా విలువైన సూచనలు, సలహాలు ఇస్తుంటారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్ 114వ ఎపిసోడ్‌ను కోలా ఆనంద్ నాయకులతో కలిసి వీక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేళాగారం సుబ్ర హ్మణ్యంరెడ్డి, కొండేటి గోపాల్, రమణారెడ్డి, రామ్, ఉమాసింగ్, నాగరాజు, డిల్లీ కుమార్, వాసుయాదవ్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. ● పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీ 109వ బూత్ పరిధిలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపట్టిన మన్ కీబాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు చంద్రప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కండ్రిగ ఉమ పాల్గొన్నారు.

150 మందికి గుండె పరీక్షలు



తుఫాన్ సెంటర్లో వైద్య సేవలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 29: ప్రపంచ హృదయ దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలోని రోటరీక్లబ్‌లో ఎంజీఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 150మందికి పైగా హృదయ సంబంధిత వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి బీపీ, షుగర్, ఈసీజీ, రక్తపరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. డాక్టర్ వివేక్ చైతన్య, గుండెకు సంబంధించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యకమంలో రోటరీక్లబ్ నిర్వా హకులు, ఎంజీఎం వైద్యులు తదితరులు పాల్గొన్నారు. ● పట్టణంలోని తుఫాన్ సెంటర్‌లో పీపుల్ వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో డాక్టర్ ఏడుకొండలు తన మిత్రబృందంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు లక్ష్మీనారాయణ, రాఘవరెడ్డి, మృదుల, మోహన్, సభ్యులు రాజేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, నరసింహులు, శేఖర్ నాయుడు, షాకీరాలీ, షఫీ, రాజా, కేశవులు, నాగరాజు, ముని సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా మారిన గ్రామీణ రోడ్లు

● పట్టించుకోని పాలకులు, అధికారులు
● సిమెంటు రోడ్లుగా మార్చాలంటున్న జనం

కేవీబీపురం, సెప్టెంబరు 29: మండలంలోని గ్రామాల్లో రోడ్ల దుస్థితికి చేరుకుని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మట్టిరోడ్లు ఉన్న రంగయ్యగుంట, కొత్తూరు, కాళంగి ఆదరం, బైరాజులకండ్రిగ, కేసీ కండ్రిగ, బంగారమ్మ కండ్రిగ తదితర గ్రామాలు మట్టిరోడ్లకే పరిమితమై ఉన్నాయి. గత వైసీపీ ఐదేళ్ల ప్రభుత్వ హయాంలో వీటిని పట్టించుకోకపోవడంతో మరింత దుస్థితికి చేరాయి. కొద్దిపాటి వర్షానికే బురదమయంగా మారి నడవడానికి కూడా వీలులేని స్థితి నెలకొంది. ప్రధాన రోడ్లు కావడంతో విద్యార్థులు, వృద్ధులు, గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. ఇక మండల కేంద్రంలోని కొత్తకాలనీ ఏర్పడి పదేళ్లయింది. ఇప్పటికీ ఒక రోడ్డు వేసిన పాపాన పోలేదు. గతంలో కాలనీకి రోడ్లు, పైపులైను నిమిత్తం రూ.35లక్షలు మంజూ రయ్యాయి. పంచాయతీ ఎన్నికలు రావడంతో కోడ్ కారణంగా వాయిదా పనులు వాయిదా పడ్డాయి. దీంతో ఆ నిధులు కాస్తా వెనక్కివెళ్లిపోయాయి. ఇది జరిగి మూడున్నర సంవత్సరాలు అయినా ఇప్పటికీ వీధులు, పైపులైన్ల ఊసేలేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి మట్టిరోడ్లను సీసీరోడ్లుగా మార్పు చేయించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.







రంగయ్యగుంటలో ప్రధానవీధి, దెబ్బతిన్న వేమలపుడి- కళత్తూరు రోడ్డు, రోడ్లే లేని కేవీబీపురం కొత్తకాలనీ

తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువుదే

ఏర్పేడు, సెప్టెంబరు 29: తల్లిదండ్రుల తరువాత స్థానం గురువుదేనని... విద్యార్థులను ఉన్నతమైన దిశగా నడిపించేది ఉపాధ్యాయుడే అని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి అన్నారు. ఎంపీ స్వగ్రామమైన మన్నసముద్రం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు గుమ్మడి మురళి ఇటీవల డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన ఎంపీ గురుమూర్తిని ఆయన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసన్నకుమార్, బాబు, కల్యాణ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



మురళిని సన్మానిస్తున్న ఎంపీ గురుమూర్తి

కంటి ఆపరేషన్లకు 60 మంది ఎంపిక



సత్యవేడు, సెప్టెంబరు 29: సత్యవేడులో ఆదివారం ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు మురళి (కోళ్ళ చిన్న) ఆధ్వర్యంలో స్థానిక సన్‌రైజ్ పాఠశాల ఆవరణలో చెన్నైకు చెందిన శంకర్ నేత్రాలయ మిషన్ ఫర్ విజన్ వైద్యబృందం చేత నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరానికి మండలంలోని పలు గ్రామాల నుంచి సుమారు 300 మంది హాజరయ్యారు. శంకర్ నేత్రాలయ వైద్యులు డాక్టర్ రాము, డాక్టర్ అరవింద్, డాక్టర్ అల్ఫోన్స్, డాక్టర్ మునివేలు కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 60 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించేందుకు వైద్యులు సిఫార్సు చేశారు. మరో 40 మందికి రాయితీపై కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు, ఎస్ఐ రామస్వామి, సన్‌రైజ్ పాఠశాల ఛైర్మన్ ప్రియాంక, కరస్పాండెంట్ సతీష్, ఎంపీటీసీ బీటీఎస్ రెడ్డి, సునీల్, రమణ, ముదిరాజ్ సేవా సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, కుమార్, చిరంజీవి, పరంధామయ్య, రాము, రామారావు, నాగరాజు, రామచంద్రయ్య, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కేటీ రోడ్డుపై మట్టిని తొలగించండి ప్లీజ్

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 29: మండలంలోని శ్రీకాళహస్తి - తడ రోడ్డుపై వేసిన మట్టిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. కేటీ రోడ్డుకు ఒక వైపున శ్రీకాళహస్తి నుంచి గ్యాస్ పైపులైను వేస్తున్నారు. పైపులైను కోసం తీస్తున్న గుంతలో మట్టిని రోడ్డుపై పోయడం వలన ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. అంతేగాకుండా రాత్రి వేళ్లలో రోడ్డుపై మట్టి ఉండటం వలన అనేక వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. ఈ పైపులైను పనుల అనేక గ్రామాల దగ్గర జరగడంతో వాహనదారులతో పాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పనులు కూడా నత్తనడకన జరుగుతున్నాయని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై మట్టిని తొలగించాలని కోరుతున్నారు.





కేటీ రోడ్డు ఆర్చి మలుపు దగ్గర రోడ్డుపై ఉన్న మట్టి, కేటీ రోడ్డు పదవ మైలు దగ్గర రోడ్డుపై ఉన్న మట్టి